teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు ... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 04 | సంచిక : 151 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | బుధవారం | 26 నవంబర్ 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.

## టీ20 ప్రపంచకప్ షెడ్యూల్ విడుదల

భారత్, శ్రీలంక సంయుక్త ఆతిథ్యం

అహ్మదాబాద్‌లో నిర్వహించనున్న ఫైనల్స్

బ్రాండ్ అంబాసిడర్ రోహిత్ శర్మ




08




# పంచాయతీ ఎన్నికలకు మోగిన రణభేరి

| విడతల | పోలింగ్ తేదీలు |
|---|---|
| మొదటి విడత | డిసెంబర్ 11 |
| రెండో విడత | డిసెంబర్ 14 |
| మూడో విడత | డిసెంబర్ 17 |



## 3 విడతల్లో తెలంగాణ సర్పంచ్ ఎన్నికలు

రాష్ట్ర వ్యాప్తంగా తక్షణమే ఎన్నికల కోడ్ అమలు

డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో పోలింగ్

12,733 గ్రామ పంచాయతీలు, 1,12,288 వార్డులకు ఎన్నికలు

నామినేషన్ల స్వీకరణ: నవంబర్ 27 నుండి ప్రారంభం

సుదీర్ఘ నిరీక్షణకు తెర, గ్రామాల్లో పెరిగిన రాజకీయ సందడి

పోలింగ్ రోజునే ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన

02

## క్షుద్రపూజల ఘటనలపై హెచ్ఆర్సీ సుమోటోగా కేసు

### పాఠశాల పిల్లల్లో మానసిక కల్లోలానికి అవకాశం

- ఆందోళన వ్యక్తం చేసిన కమిషన్
- కలెక్టర్లు, పోలీస్ అధికారులకు నోటీసులు జారీ
- డిసెంబర్ 29 లోగా వాస్తవ నివేదికల సమర్పణకు ఆదేశం



02




బలవంతంగా గేమింగ్, బెట్టింగ్ యాప్స్‌లోకి

## యూజర్ల రీడైరెక్షన్

- ఎక్కువ మొత్తం సంపాదనకు ఈ మార్గమే కారణం
- ఐ బొమ్మ రవి దొరుకుతాడనే గ్యారెంటీ లేకుండే..
- రవి మిత్రుడు నిఖిల్ వల్లే పట్టుకున్నాం
- ఐ బొమ్మ టీం ఇంకా కరేబియన్ దీవుల్లోనే ఉంది
- ఐ బొమ్మ కేసులో బెట్టింగ్, పైరసీపై పోలీసుల కీలక వెల్లడి

హైదరాబాద్, నవంబర్ 25 (తీన్మార్ న్యూస్): ఐ బొమ్మ కేసులో రవికి సంబంధించి పలు కీలక విషయాలను పోలీసులు మీడియాకు వెల్లడించారు. రవిని ఐదు రోజుల పాటు పోలీసులు తమ కస్టడీలోకి తీసుకుని విచారించారు. ఈ నేపథ్యంలో మంగళవారం సైబర్ క్రైమ్

మిగతా 5 లో




## స్థానిక ఎన్నికలపై బీజేపీ అధిష్టానం దృష్టి

ఎన్నికలకు త్వరలో మానిటరింగ్ కమిటీ ఏర్పాటు

ఎంపీలు, ఎమ్మెల్యేలకు కీలక బాధ్యతలు

.. వివరాలు 2లో



## అయోధ్య రామాలయంలో ధ్వజారోహణం

ఆలయ శిఖరంపై కాషాయ పతాక ఆవిష్కరణ

మానవాళికి శక్తి కేంద్రం అయోధ్య: ప్రధాని మోడీ

.. వివరాలు 2లో

హెచ్ఐఎల్టీపీ రూ.5 లక్షల కోట్ల

## అవినీతి స్కీమ్

- హెచ్ఐఎల్టీపీ పాలసీపై కేటీఆర్ తీవ్ర ఆరోపణలు
- 9,292 ఎకరాలు ప్రైవేటుపరం చేసేందుకు ప్రయత్నం
- మార్కెట్ విలువలో 30%కే భూముల అప్పగింత
- అంబానీ సరసన నిలవడానికి రేవంత్ రెడ్డి ప్రయత్నం
- సంచలన వాఖ్యలు చేసిన కేటీఆర్



హైదరాబాద్, నవంబర్ 25 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు లక్షల కోట్ల రూపాయల అవినీతి స్కీమ్‌కి తెర లేపిందని కేటీఆర్ ఆరోపించారు. అందుకే 9,292 ఎకరాల భూమి ధారాదత్తం చేసేందుకు హెచ్ఐఎల్టీపీ పాలసీ తీసుకువచ్చిందని కేటీఆర్ అన్నారు. గతంలో ఉద్యోగ, ఉపాధ్యాయ

మిగతా 2 లో



## జీహెచ్ఎంసీలో మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల విలీనం

- విద్యుత్ వ్యవస్థ బలోపేతం.. మూడో డిస్కమ్ ఏర్పాటు
- పరిశ్రమలకు క్యాప్టివ్ పవర్ జనరేషన్ అనుమతి
- రెసిడెన్షియల్, స్పోర్ట్స్ స్కూళ్లకు స్థల కేటాయింపు
- తెలంగాణ కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు

హైదరాబాద్, నవంబర్ 25 (తీన్మార్ న్యూస్): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం జరిగిన తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు

మిగతా 2 లో



## ఏకగ్రీవమైతే రూ.10 లక్షలు

పంచాయతీలకు బంపర్ ఆఫర్: బండి సంజయ్

కాంగ్రెస్, బీఆర్ఎస్ హామీలు నమ్మి మోసపోవద్దు

గ్రామ అభివృద్ధికి కేంద్ర నిధులే ఆధారం

సంచల వాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి బండి

02

## బంగాళాఖాతం ప్రాంతంలో నో-ఫ్లై జోన్

- భారత్ క్షిపణి పరీక్ష నేపథ్యంలో నోటీసులు
- డిసెంబర్ 6-8 మధ్య పరీక్ష నిర్వహణ
- 1,480 కిలోమీటర్ల వరకు విస్తరణ నిషేధం




02


## జీవో రాకముందే బయటికి చేరవేత

- లీకుల ఆధారంగా ప్రతిపక్షాల విమర్శలు
- కేబినెట్ లీకులపై మంత్రి శ్రీధర్ బాబు సీరియస్
- బాధ్యులపై కఠిన చర్యలకు కేబినెట్ ఆలోచన

హైదరాబాద్, నవంబర్ 25 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో ప్రభుత్వ నిర్ణయాలు, కేబినెట్‌లో జరిగిన చర్చల సారాంశం మొత్త ప్రతిపక్ష నేతలకు చేరవేస్తున్న లీకు వీరుల విషయంలో మంత్రి శ్రీధర్ బాబు స్పందించారు. మంగళవారం

మిగతా 2 లో








కర్రిగుట్టల వద్ద మరో సీఆర్పీఎఫ్

## బేస్ క్యాంప్

### నక్సలిజం ఫ్రీ ఇండియా దిశగా ముందడుగు

మావోయిస్టుల ఏరివేతే లక్ష్యం

కర్రిగుట్టల్లో 14 ఐఈడీలను గుర్తింపు

ఈ ప్రాంతాన్ని సేఫ్ ప్లేస్ గా తీర్చి దిద్దుతాం

సీఆర్ పీఎఫ్ ఐజీ త్రివిక్రమ్ ఐపీఎస్

6

వచ్చే ఏడాది మార్చి 31 నాటికి దేశంలో మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా పని చేస్తున్నామని కేంద్రం ప్రకటించిన వేళ మావోయిస్టులకు కంచుకోటగా ఉన్న కర్రిగుట్టల విషయంలో భద్రతాబలగాలు మరో కీలక ముందడుగు వేశాయి.

# పంచాయతీ ఎన్నికలకు మోగిన రణభేరి

తెలంగాణ బ్యూరో, నవంబర్ 25 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల సందడి మొదలైంది. రాష్ట్ర ఎన్నికల సంఘం మంగళవారం సాయంత్రం సర్పంచ్ ఎన్నికల పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేసింది. రాష్ట్రంలోని గ్రామీణ పాలనా వ్యవస్థకు దిక్సూచిగా నిలిచే ఈ ఎన్నికలను మూడు విడతలుగా నిర్వహించనున్నట్లు ప్రకటించింది. షెడ్యూల్ విడుదలైన వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ తక్షణమే అమల్లోకి రానుంది, దీంతో ప్రభుత్వ కార్యకలాపాలు, పథకాలపై తాత్కాలికంగా పరిమితులు విధించబడతాయి.



**విడతల వారీగా పోలింగ్ తేదీలు**

తెలంగాణలోని మొత్తం 31 జిల్లాల్లోని 12,733 గ్రామ పంచాయతీలకు మరియు 1,12,288 వార్డులకు ఈ ఎన్నికలు జరగనున్నాయి. ఓటింగ్ జరిగిన రోజునే కౌంటింగ్ నిర్వహించి, ఫలితాలను ప్రకటించడం ఈ ఎన్నికల ప్రత్యేకత.

**సుదీర్ఘ నిరీక్షణకు తెర**

**గ్రామాల్లో పెరిగిన సందడి**

రిజర్వేషన్ల ప్రక్రియ ఇప్పటికే పూర్తవడంతో, తాజా షెడ్యూల్ కోసం ఎదురుచూస్తున్న రాజకీయ పార్టీలు, స్థానిక నాయకులు, సర్పంచ్ అభ్యర్థుల్లో ఉత్సాహం పెరిగింది. ఈ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాలపై, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అధికార పార్టీ బలాన్ని అంచనా వేయడానికి కీలకంగా మారనున్నాయి. గ్రామ స్థాయిలో నాయకత్వం కోసం తీవ్రమైన పోటీ నెలకొనే అవకాశం ఉంది.

**ముఖ్య గమనికలు**

గ్రామ పంచాయతీల సంఖ్య: 12,733

వార్డుల సంఖ్య: 1,12,288

ఎన్నికల కోడ్: షెడ్యూల్ విడుదలైన నాటి (నవంబర్ 25) నుంచే రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది.

రిజర్వేషన్లు: సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్లు ఇప్పటికే ఖరారయ్యాయి.

**నమూనా ప్రవర్తనా నియమావళి**

నిధుల పరిమితి: నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థులు ఎన్నికల ఖర్చులపై నిర్దేశిత పరిమితిని పాటించాలి.

ప్రభుత్వ కార్యక్రమాలు: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున, రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఎలాంటి కొత్త పథకాలను ప్రకటించడం లేదా ప్రారంభించడం నిషేధం. అభివృద్ధి పనుల కోసం కొత్త నిధుల విడుదల చేయరాదు.

ప్రభుత్వ యంత్రాల వినియోగం: అధికార పార్టీకి చెందిన మంత్రులు/నాయకులు ప్రభుత్వ వాహనాలు లేదా సిబ్బందిని ఎన్నికల ప్రచారం కోసం ఉపయోగించరాదు.

పోలింగ్ రోజున: పోలింగ్ ముగిసే 48 గంటల ముందు ప్రచారాన్ని నిలిపివేయాలి. పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో గుంపులుగా చేరడం, ప్రచారం చేయడం నిషేధం.



**ఎన్నికల నోటిఫికేషన్ ముఖ్య వివరాలు**

| | మొదటి విడత | రెండో విడత | మూడో విడత |
|---|---|---|---|
| నోటిఫికేషన్ విడుదల | నవంబర్ 26 | నవంబర్ 29 | డిసెంబర్ 2 |
| నామినేషన్ల స్వీకరణ | నవంబర్ 27 | నవంబర్ 30 | డిసెంబర్ 3 |
| నామినేషన్ల ముగింపు | నవంబర్ 29 | డిసెంబర్ 2 | డిసెంబర్ 5 |
| నామినేషన్ల పరిశీలన | నవంబర్ 30 | డిసెంబర్ 3 | డిసెంబర్ 6 |
| ఉపసంహరణ గడువు | డిసెంబర్ 3 | డిసెంబర్ 6 | డిసెంబర్ 9 |
| చిహ్నాల కేటాయింపు | డిసెంబర్ 3 | డిసెంబర్ 6 | డిసెంబర్ 9 |
| పోలింగ్ తేదీ | డిసెంబర్ 11 | డిసెంబర్ 14 | డిసెంబర్ 17 |

## హెచ్‌ఐఎల్టీపీ రూ.5 లక్షల కోట్ల అవినీతి స్కీమ్

మొదటి పేజీ తరువాయి

అవకాశాల కోసం ప్రజల నుంచి సేకరించిన ప్రభుత్వ భూమిని అతి తక్కువ ధరకి పారిశ్రామిక వ్యక్తులకు గత ప్రభుత్వాలు ఇచ్చాయి. అప్పటి మార్కెట్ రేట్‌కి సంబంధం లేకుండా అత్యంత చవకగా ఈ భూములను అందించడం జరిగింది. కానీ ఈరోజు హైదరాబాద్‌లో ఉన్న 20 పారిశ్రామిక వాడలలోని 9,292 ఎకరాల భూమిని ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఒకప్పుడు పరిశ్రమల కోసం, ప్రజల ఉపాధి కోసం వచ్చిన భూములను ఈరోజు ప్రైవేటు వ్యక్తులు అపార్ట్‌మెంట్లు కడతామంటే కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతి ఇస్తున్నది. మేము గతంలో తీసుకువచ్చిన గ్రిడ్ పాలసీలో భాగంగా 50% ఐటీ ఆఫీసులకు, మిగిలిన 50% ఇతర అవసరాలకు వినియోగించుకునేలా ప్రభుత్వానికి తగిన ఫీజులు కట్టిన తర్వాత అవకాశం ఇచ్చాము. కానీ ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా ప్రైవేటు వ్యక్తుల లాభం కోసం దారాదత్తం చేస్తున్నది. మార్కెట్ ధరలతో సంబంధం లేకుండా కేవలం ప్రభుత్వ రిజిస్ట్రేషన్ విలువలో 30% చెల్లిస్తే చాలు అంటూ అప్పనంగా ఒకప్పటి ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తున్నది. ఈ విధంగా ఐదు లక్షల కోట్ల రూపాయల భూముల స్కామ్‌కు తెరలేపింది. ఈరోజు రేవంత్ రెడ్డితో పాటు ఆయన మనవడు, ముని మనవడు వరకు కావాల్సినన్ని డబ్బులు సంపాదించుకునే ప్రయత్నంలో భాగంగానే ఈ పాలసీ తీసుకువచ్చారు. ఈ పాలసీ ద్వారా ఆయన అంబానీ సరసన నిలవాలని రేవంత్ రెడ్డి ప్రయత్నం చేస్తున్నట్లు కనిపిస్తుంది అన్నారు. అంత భారీగా దోపిడీ చేసేందుకు ఆయన తెరలేపారు. ఇలా లక్షలాది కోట్ల రూపాయల భూములను అప్పనంగా చేస్తున్న ఈ భూముల దందా పైన వెంటనే ప్రజలను జాగ్రత్త పరుస్తూ ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని విద్యార్థి నాయకులకు కేటీఆర్ దిశా నిర్దేశం చేశారు. హైదరాబాద్ నగరంలో పార్కులకు, ఇళ్లకు, చివరికి శ్మశానానికి కూడా జాగా లేకున్నా, ప్రైవేటు వ్యక్తులకు ఈ భూములన్నింటినీ అప్పనంగా అప్పగిస్తున్నది. ఇదే అంశాన్ని ఈరోజు మన జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు జనరల్ బాడీ కౌన్సిలింగ్ సమావేశంలో నిలదీశారని తెలిపారు. 9300 ఎకరాల హైదరాబాద్ భూములను, ప్రజల భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పనంగా చేస్తామంటే ఊరుకోమని, అది కాంగ్రెస్ పార్టీ అబ్బ జాగీరు కాదని ప్రశ్నించినట్లు తెలిపారు.



## ఏకగ్రీవమైతే రూ.10 లక్షలు

హైదరాబాద్, నవంబర్ 25 (తీన్మార్ న్యూస్): గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ బంపర్ ఆఫర్ ప్రకటించారు. పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే ఆ గ్రామాభివృద్ధి కోసం ప్రత్యేకంగా రూ.10 లక్షల నిధులను అందజేస్తానని కేంద్ర మంత్రి ప్రకటించారు. తాను ఒక్కసారి మాట ఇస్తే తప్పే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీ ప్రజలను ఏకం చేసి అభివృద్ధి వైపు దృష్టి సారించేలా ప్రోత్సహించేందుకే ఈ నిధులను ప్రకటించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ మేరకు బండి సంజయ్ మంగళవారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకటన సారాంశమిదే



గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏకగ్రీవ పంచాయతీలకు రూ.5 లక్షల ప్రోత్సాహక నిధులిస్తామని హామీ ఇవ్వడంతో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో దాదాపు 70 గ్రామ పంచాయతీల్లో బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థులను ఏకగ్రీవం చేశారు. కానీ ఐదేళ్లయినా ఆయా గ్రామాలకు కేసీఆర్ ప్రభుత్వం నయాపైసా ఇవ్వకుండా మొండి చేయి చూపింది. అంతకుముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు సైతం ఏకగ్రీవం పేరుతో నజరానా ప్రకటించి మోసం చేసింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకుల మాటలు నమ్మి ఏకగ్రీవం చేసిన పంచాయతీల ప్రజలు ఆర్థికంగా నష్టపోయారు. ఆయా గ్రామాల్లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. దయచేసి ఈ ఎన్నికల్లో మరోసారి మోసం చేసేందుకు ఆ రెండు పార్టీలు మళ్లీ ప్రలోభ పెట్టేందుకు సిద్ధమవుతున్నాయి. మాయ మాటలు నమ్మి మోసపోవద్దని కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలను కోరుతున్నా. భారతీయ జనతా పార్టీ మాట ఇస్తే తప్పదు. మీ బండి సంజయ్ ఎన్నడూ చేసేదే చెబుతాడు. చెప్పేదే చేస్తాడు. ఇచ్చిన మాట ప్రకారం ఈ పంచాయతీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులుగా ఏకగ్రీవం చేస్తే ఆ గ్రామాలకు రూ.10 లక్షల చొప్పున ప్రోత్సాహక నిధులిస్తానని మాట ఇస్తున్నా. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ప్రజల ముందు కొన్ని వాస్తవాలు ఉంచుతున్నా. కాంగ్రెస్ 2 ఏళ్ల పాలనలో గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం నయాపైసా ఇయ్యలేదు. రాష్ట్ర ప్రభుత్వం దగ్గర పైసలల్లేవు. నన్ను కోసినా నయాపైసా రాదు అని సాక్షాత్తు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పడమే ఇందుకు నిదర్శనం. అట్లాగే బీఆర్ఎస్ 10 ఏళ్ల పాలనలోనూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి పైసా ఇయ్యలేదు. అప్పులు తెచ్చి అభివృద్ధి చేసిన సర్పంచులకు బిల్లులు రాక అప్పులపాలై ఆత్మహత్య చేసుకునే దుస్థితి ఏర్పడటమే నిదర్శనం.

గ్రామాల అభివృద్ధికి నిధులు ఇస్తోంది నరేంద్రమోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం మాత్రమే. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులన్నీ కేంద్ర నిధులతో కొనసాగుతున్నవే. భవిష్యత్తులోనూ గ్రామాలకు నిధులిచ్చేది కేంద్ర ప్రభుత్వమే. అసలు పంచాయతీ ఎన్నికలు నిర్వహించేది కూడా కేంద్ర నిధుల కోసమేననే వాస్తవాన్ని ప్రజలు గుర్తించాలని కోరుతున్నా. పంచాయతీ ఎన్నికలు జరగకపోతే కేంద్ర నిధులు రావనే భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తోందే తప్ప వాస్తవానికి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనే చిత్తశుద్దే లేదు. ఇక ఎమ్మెల్యే, ఎంపీల విషయానికొస్తే ఎమ్మెల్యేలకు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకునేందుకు ప్రత్యేకంగా నిధులు లేవు. గతంలో ఇచ్చిన సీడీఎఫ్(కాన్‌స్టిట్యూయన్సీ డెవలెప్ మెంట్ ఫండ్)ను ప్రభుత్వం పూర్తిగా నిలిపివేసింది. ఫలితంగా ఎమ్మెల్యేగా గెలిచినా పంచాయతీలకు నయా పైసా కూడా ఇయ్యలేని పరిస్థితి. కానీ పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న నాకు ఎంపీ లాడ్స్ నిధులు ఉన్నాయి. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ బుల్ (సీఎస్సార్) ఫండ్ రూపంలో పెద్ద ఎత్తున కోట్లాది రూపాయల నిధులు తీసుకొచ్చి ఇప్పటికే విద్య, వైద్య రంగాలను అభివృద్ధి చేసేందుకు ఖర్చు చేస్తున్న విషయం మీకు తెలిసిందే. ఈ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులను ఏకగ్రీవం చేసినట్లయితే ఆయా గ్రామ పంచాయతీలకు రూ.10 లక్షల చొప్పున ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తా. పూర్తిస్థాయిలో ఆ గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు క్రుషి చేస్తా. దీంతోపాటు కేంద్ర మంత్రిగా కొనసాగుతున్నందున కేంద్రాన్ని ఒప్పించి మరిన్ని నిధులు తెచ్చి పంచాయతీల అభివృద్ధికి క్రుషి చేస్తా. చివరగా ఒక్కమాట నిధులు ఇచ్చేది, తెచ్చేది బీజేపీ మాత్రమే. మరి అట్లాంటప్పుడు ఇతర పార్టీలు బలపర్చిన అభ్యర్థులకు ఓటేసి ఏం లాభం? పొరపాటున కాంగ్రెస్ లేదా బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపిస్తే కొత్తగా నిధులు రాకపోగా, కేంద్రం నుండి వచ్చే నిధులను కూడా దారి మళ్లించే ప్రమాదముంది. అందుకే మాయ మాటలు నమ్మకండి. ప్రలోభాలకు మోస పోకండి. పొరపాటు చేస్తే 5 ఏళ్ల పాటు నరక యాతన తప్పదు. అందుకే ఆలోచించి నిర్ణయం తీసుకోండి. బీజేపీ బలపర్చిన అభ్యర్థులకు ఓటేసి గెలిపిద్దాం. మన గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసుకుందాం. అని బండి సంజయ్ అన్నారు.

## క్షుద్రపూజల ఘటనలపై హెచ్‌ఆర్సీ సుమోటోగా కేసు



హైదరాబాద్, నవంబర్ 25 (తీన్మార్ న్యూస్): తెలంగాణలోని జనగామ, వరంగల్, జగిత్యాల జిల్లాల్లో చోటుచేసుకున్న జంతువుల వికృత్యాలు, క్షుద్రపూజల ఘటనలపై తెలంగాణ మానవ హక్కుల కమిషన్ సుమోటోగా కేసు నమోదు చేసింది. ఈ నెల 24న మీడియా కథనాల్లో ప్రచురితమైన వార్తలను పరిగణనలోకి తీసుకొని, కమిషన్ ఛైర్‌పర్సన్ డా. జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలో చర్యలు చేపట్టింది. ముఖ్యంగా జగిత్యాల పట్టణంలోని ధరూర్ క్యాంప్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో కూడా జరిగినట్లు వార్తల్లో వెల్లడైన నేపథ్యంలో, పాఠశాల పిల్లల్లో భయం, మానసిక కల్లోలం నెలకొనే అవకాశం ఉందని కమిషన్ ఆందోళన వ్యక్తం చేసింది. ఇటువంటి కార్యకలాపాలు ప్రజా శాంతి, భద్రత పరిరక్షణలో లోపాలను సూచిస్తున్నాయని అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో జనగాం, వరంగల్, జగిత్యాల జిల్లాల కలెక్టర్లు, వరంగల్ పోలీస్ కమిషనర్, జగిత్యాల ఎస్పీ లకు కమిషన్ నోటీసులు జారీ చేసింది. జంతు వికృత్యాలపై ఇప్పటి వరకు జరిగిన విచారణ, తీసుకున్న చర్యలు, పాఠశాల ప్రాంగణాలు సహా ప్రజా ప్రదేశాల్లో భద్రతా చర్యలు వంటి అంశాలపై వివరాలతో కూడిన వాస్తవ నివేదికలు సమర్పించాలని ఆదేశించింది. సంబంధిత అధికారులు తమ నివేదికలను డిసెంబర్ 29న ఉదయం 11 గంటలకు కమిషన్‌కు అందజేయాల్సి ఉంటుంది. ఈ మేరకు మంగళవారం టీజీహెచ్‌ఆర్సీ ఒక ప్రకటన విడుదల చేసింది.

## అయోధ్య రామాలయంలో ధ్వజారోహణం



న్యూ ఢిల్లీ, నవంబర్ 25 (తీన్మార్ న్యూస్): ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం అయోధ్య మానవాళికి శక్తి కేంద్రంగా మారిందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. మంగళవారం ఆయన అయోధ్య రామాలయ ధ్వజరోహణ కార్యక్రమంలో పాల్గొని ఆలయ శిఖరంపై కాషాయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 'జై శ్రీరామ్' నినాదంతో ప్రసంగాన్ని ప్రారంభించిన ప్రధాని మోడీ మాట్లాడుతూ భారతీయ సాంస్కృతిక చైతన్యానికి అయోధ్య సాక్షిగా నిలిచిందన్నారు. రామాలయ నిర్మాణ యజ్ఞానికి నేడు పూర్ణాహుతి జరిగిందని అభివర్ణించారు. ధర్మధ్వజం కేవలం జెండా కాదు భారతీయ సంస్కృతి పునర్వికాసానికి చిహ్నమని అన్నారు.

**రాముడు కులం చూడడు**

సంకల్పం, సఫలతకు ఈ ధ్వజం చిహ్నమని తెలిపారు. ధర్మధ్వజం శ్రీరాముడి సిద్ధాంతాలను ప్రపంచానికి చాటుతోందని పేర్కొన్నారు. కర్మ, కర్తవ్యాల ప్రాముఖ్యాన్ని ధర్మధ్వజం చెబుతోందని అన్నారు. నిరుపేదలు, దుఃఖితులు లేని సమాజాన్ని తాము ఆకాంక్షిస్తున్నామని కామెంట్ చేశారు. ధర్మధ్వజాన్ని దూరం నుంచి చూసినా రాముడిని చూసినంత పుణ్యం లభిస్తుందని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది రామ భక్తుల కల నేడు సాకారమైందని తెలిపారు. రామ మందిర నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ నమస్కరిస్తున్నానని అన్నారు. ఒక వ్యక్తి పురుషోత్తముడిగా ఎలా ఎదిగాడో అయోధ్య చెబుతోందని రాముడు కులం చూడడని, భక్తి మాత్రమే చూస్తాడని తెలిపారు. ఆదర్శ పురుషుడు శ్రీరాముడికి భేద భావాలు ఉండవని అన్నారు. శతాబ్దాల నాటి గాయాలకు నేడు ఉపశమనం లభించిందని అన్నారు. ఐదు శతాబ్దాలుగా ఉన్న సమస్య పరిష్కారమైందని పేర్కొన్నారు. ధర్మధ్వజంపై ఉన్న 'కోవిదార వృక్షం' మన ఇతిహాస వైభవానికి ప్రతీక అని కొనియాడారు.

## బంగాళాఖాతం ప్రాంతంలో నో-ఫ్లై జోన్

న్యూ ఢిల్లీ, నవంబర్ 25 (తీన్మార్ న్యూస్): బంగాళాఖాతం ప్రాంతంలో భారత్ నో-ఫ్లై జోన్ నోటీసులు జారీ చేసింది. డిసెంబర్ 6-8 మధ్య క్షిపణి పరీక్ష నిర్వహించనున్నట్లు నోటిఫికేషన్ ప్రకటించింది. 1,480 కిలోమీటర్ల వరకు నో-ఫ్లై జోన్ విస్తరించి ఉంది. డిసెంబర్ 6న 12:30 యూటీసీ నుండి డిసెంబర్ 8న 15:30 యూటీసీ వరకు ఈ నో - ఫ్లై జోన్ ఉంటుందని ఉత్తర్వులు చెప్పాయి. నో ఫ్లై జోన్ బంగాళాఖాతంపై ఎక్కువ ప్రాంతాన్ని కవర్ చేస్తోంది. ఇది క్షిపణి కార్యకలాపాల సమయంలో వాయు, సముద్ర భద్రతను నిర్ధారించడానికి ఈ నోటిఫికేషన్‌ను జారీ చేశారు. క్షిపణి ప్రయోగాలకు ముందు భారత్ ఇలాంటి హెచ్చరికలు జారీ చేస్తూ ఉంటుంది. ఈ ఏడాది ప్రారంభంలో జూలైలో 24 గంటల వ్యవధిలో మూడు అణ్వాయుధ సామర్థ్యం ఉన్న స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణులు అయిన పృథ్వీ-II, అగ్ని-I, ఆకాష్ ప్రైమ్ క్షిపణులను ప్రయోగించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఆకాష్ క్షిపణి వ్యవస్థ పాకిస్తాన్ నుంచి వచ్చే క్షిపణుల్ని, డ్రోన్లను సమర్థవంతంగా అడ్డుకుంది. జూలై 16న, భారత సైన్యం లడఖ్‌లో 4,500 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తులో అప్‌గ్రేడ్ చేసిన ఆకాష్ ప్రైమ్ క్షిపణిని పరీక్షించింది. తక్కువ ఆక్సిజన్ కలిగిన ఎత్తైన ప్రాంతాల్లో వాయు రక్షణ వ్యవస్థల్ని పరీక్షించారు. డీఆర్డీఓ డెవలప్ చేసిన ఆకాష్ ప్రైమ్ వ్యవస్థ మునుపటి ఆకాష్ వ్యవస్థకు అప్‌గ్రేడ్ వెర్షన్. ఇది 30-35 కి.మీ పరిధిలో 18 నుంచి 20 కి.మీ ఎత్తులో యుద్ధవిమానాలు, డ్రోన్లు, క్రూయిజ్ క్షిపణుల్ని, డ్రోన్లను నివారిస్తుంది. పృథ్వీ-II అనేది 350 కిలోమీటర్ల పరిధి సర్ఫేజ్ టూ సర్ఫేజ్ క్షిపణి. ఇది అత్యంత ఖచ్చితత్వంతో దాడులు చేస్తుంది. అగ్ని-1 700 కి.మీ పరిధిని కలిగి ఉంటుంది.

# అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు

**మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు వెల్లడి**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, నవంబర్ 25 (తీన్మార్ న్యూస్): ఇండ్లు లేని అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ రెండు పడక గదుల ఇండ్లు మంజూరు చేస్తున్నట్లు భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో గాంధీ నగర్‌లోని 16 మంది లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి లబ్ధిదారులకు గృహాల కేటాయింపు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి నిర్మాణానికి మహిళా శక్తి స్వయం సహాయక సంఘాల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సొంత ఇంటి కల నెరవేర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలియజేశారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ లబ్ధిదారులు గృహ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గృహ ప్రవేశ కార్యక్రమాలకు తాను స్వయంగా హాజరవుతానని తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, గృహ నిర్మాణ శాఖ పిడి లోకిలాల్, డీఈ శ్రీకాంత్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# పరికిచెరువు, ఆలయ భూములకు సరిహద్దులను నిర్ణయించండి

**హైడ్రా కమిషనర్‌కు వినతి**




కుత్బులాపూర్, నవంబర్ 25 (తీన్మార్ న్యూస్): కుత్బులాపూర్ మండలం గాజులరామారం జోన్ లోని పరికిచెరువు మరియు జగద్గిరిగుట్టలో వెలిసిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ భూములను సర్వే చేసి సరిహద్దులను నిర్ణయించి చుట్టూ ఫెన్సింగ్ వేయాలని కోరుతూ నిన్న సోమవారం రోజున హైడ్రా కమిషనర్ రంగనాథ్ కి పరికిచెరువు పరిరక్షణ కమిటీ సభ్యులు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. పరికిచెరువు పరిరక్షణ కమిటీ నాయకులు ఉమా మహేష్, సాయి పంతుల, పవన్, వంశీ లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ ని ప్రజావాణిలో కలిసి గతంలో పరికిచెరువు మరియు ఆలయ భూములకు సంబంధించి అన్యాక్రాంతం కాకుండా హైడ్రాధికారులు చర్యలు తీసుకున్నారని దానివల్ల భూకబ్జాలు తగ్గిపోయినప్పటికీ, ఒకవేళ సరిహద్దులు నిర్ణయించకపోతే ఏదో ఒక రోజు వాటిని కూడా కబ్జాదారులు అమ్మేసే పరిస్థితి ఏర్పడుతుందని దానివల్ల పేద ప్రజలు నష్టపోయే ప్రమాదం ఉంది కాబట్టి అలాంటి నష్టం జరగకుండా సరిహద్దులను నిర్ణయించి ఫెన్సింగ్ వేయాల్సిందిగా కోరడం జరిగింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించి స్థానిక అధికారులకు ఫెన్సింగ్ వెయ్యడానికి చర్యలు చేపట్టాలని అక్కడే ఆదేశాలు ఇవ్వడం జరిగింది.

# విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

**జిల్లా కలెక్టర్ అండ్ మేజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్**



మహబూబాబాద్ జిల్లా, నవంబర్ 25 (తీన్మార్ న్యూస్): విద్యార్థులు పుస్తకాలను చదవడంతోపాటు వాటిలోని అంశాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ అండ్ మేజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. మంగళవారం మహబూబాబాద్ పట్టణంలోని అనంతారం ఆదర్శ పాటశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ తిలకించి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో ఆలోచన శక్తిని రేకెత్తిస్తాయన్నారు. విద్యార్థులు పాఠశాలలో చదువుకుంటున్న క్రమంలో బట్టి పద్ధతిని వీడాలని సూచించారు. పుస్తకాలు చదవడం, రాయడం మాత్రమే కాకుండా అందులోని విషయ పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులు తర్కికంగా ఆలోచించుటకు కొత్త ఆలోచనలు, పరిష్కారాలు లేదా పద్ధతులను సృష్టించడానికి పెంచుకొనుటకు ఇలాంటి ప్రదర్శనలు దోహద పడతాయని తెలిపారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో స్థానం సంపాదించేలా ప్రయత్నం చేయాలని, సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలు ఎగ్జిబిట్లపై పరిశోదన పద్దతులను విద్యార్థులను అడిగి వారి యొక్క వివరణను పరిశీలించి అభినందించారు. జిల్లా విద్యాశాఖ అధికారి దక్షిణమూర్తి ప్రదర్శనను ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థులు ఈ ప్రదర్శనలో 85 ఇన్ స్పైర్, 230 బాల వైజ్ఞానిక పాల్గొన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి అప్పారావు, వివిధ పాటశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యం




జయశంకర్ భూపాలపల్లి జిల్లా, నవంబర్ 25 (తీన్మార్ న్యూస్): మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. మంగళవారం మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని అమ్మ గార్డెన్స్ లో నియోజకవర్గ పరిధిలోని మండలాల స్వయం సహాయక సంఘాల మహిళలకు గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వడ్డీ లేని రుణాలు వడ్డీ రాయితీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొలువుదీరిననాటి నుంచి మహిళల ఆర్థికాభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. మహిళ క్యాంటీన్లు, సోలార్ విద్యుత్ కేంద్రాలు, పెట్రోల్ బంకులు, ఇందిరమ్మ ఇండ్లు వంటి అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. మండలంలో మూడున్నర ఎకరాల ప్రభుత్వ భూమిని వివో సంఘాలకు అప్పగిస్తే ఒక మెగావాట్ సామర్థ్యం కలిగిన సోలార్ విద్యుత్తు కేంద్రం ఏర్పాటు చేస్తామని దాని ద్వారా మహిళలకు ఆదాయం సమకూరుతుందని తెలిపారు. నేడు ఆడబిడ్డలకు రుణాలు ఇవ్వడానికి బ్యాంకర్లు ముందుకు వస్తున్నాయని అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లో పెట్రోల్ బంకులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మహిళలు ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును ఆసరాగా చేసుకుని అభివృద్ధి సాధించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం 58 వేల ప్రభుత్వ ఉద్యోగాలు, 4 లక్షల 70 వేల నూతన రేషన్ కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు. గణపురంలో 250 కోట్లతో మిర్చి నుండి నూనె తీసే పరిశ్రమ అలాగే పారిశ్రామిక పార్క్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. దున్నుకునే రైతులకు భూమి హక్కులు కల్పించేందుకు భూ భారతి చట్టం తెచ్చినట్లు తెలిపారు. నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని తెలిపారు. పేదల బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి నాడు శ్రీమతి ఇందిరాగాంధీ 20 సూత్రాలు పథకాన్ని అమలు చేశారని అలాంటి ఉక్కు మహిళ ఇందిరమ్మను స్పూర్తితో తీసుకొని రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఆయన తెలిపారు. ధనవంతులు తినే సన్న బియ్యం నేడు పేదోళు తింటున్నారని ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఏటా 4 వేల కోట్ల రూపాయల ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. కొడవటంచ లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని మరో యాదాద్రి టెంపుల్ గా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. బిగులోని దేవాలయం అభివృద్ధికి 6 కోట్ల రూపాయల మంజూరు చేసినట్లు తెలిపారు. 660 కోట్ల రూపాయలతో భోపాలపల్లి నుండి గూడెప్పాడు వరకు 4 వరసల రహదారి నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. 52 కోట్లతో రైతులు పొలాలకు వెళ్లేందుకు రహదారి పనులు మంజూరు చేసినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ జిల్లాలో 6107 మహిళా సంఘాల సభ్యులకు 3.20 కోట్ల వడ్డీలేని రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇది చాలా మంచి కార్యక్రమమని మహిళలు అవగాహన కలిగి ఉండి అభివృద్ధి సాధించాలని సూచించారు. అమ్మ ఆదర్శ కమిటీలు ఏర్పాటు ద్వారా 12 కోట్ల రూపాయలు పనులు పాఠశాలల్లో చేపించినట్లు తెలిపారు. ఇందిరా మహిళల శక్తి క్యాంటీన్లు, మహిళలకు కుట్టు మిషన్లు, స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాలు, ఆర్టిసి బస్సులు, పెట్రోల్ బంకులు, విద్యార్థులకు యూనిఫామ్స్ కుట్టిస్తున్నట్లు తెలిపారు. మహిళల అభివృద్ధికి ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం అన్ని వేళల కృషి చేస్తుందని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా మహిళలు అంది వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వ్యాపారవేత్తలుగా ఎదగాలని ఆయన సూచించారు. అనంతరం మహిళా సంఘ సభ్యులకు వడ్డీ లేని రుణాలు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిఆర్డిఓ బాలకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీదేవి, డిసిసిబి చైర్మన్ నరసింహారావు, జిల్లా, మండల సమాఖ్యల చైర్మన్లు,కార్యదర్శులు, డిపిఎంలు, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

# క్లెయిమ్ చేసుకోని ఆర్థికపరమైన ఆస్తుల కోసం ప్రత్యేక కార్యక్రమం

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, నవంబర్ 25 (తీన్మార్ న్యూస్): కేంద్ర ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆర్థిక సేవల విభాగం ఆదేశాలకు అనుగుణంగా “మీ డబ్బు, మీ హక్కు” అనే ఇతివృత్తంతో క్లెయిమ్ చేసుకోని ఆర్థికపరమైన ఆస్తుల సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర ఆర్థిక మంత్రి 2025 అక్టోబర్ 4న గుజరాత్‌లోని గాంధీనగర్‌లో జాతీయ స్థాయి కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ఇది 2025 అక్టోబర్ 01 నుంచి 2025 డిసెంబర్ 31 వరకు మూడు నెలల పాటు కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. క్లెయిమ్ చేసుకోని బ్యాంకు పొదుపులు, షేర్లు, డివిడెండ్లు, మ్యూచువల్ ఫండ్లు, బీమా తదితరాలను క్లెయిమ్ చేసుకునేందుకు వీలు కల్పించాలన్న లక్ష్యంతో దీనిని చేపట్టారని తెలిపారు. జాతీయ ప్రాముఖ్యత కలిగిన ఈ కార్యక్రమం ఆర్థికపరమైన ఆస్తులను ప్రజలు సరైన పద్ధతిలో క్లెయిమ్ చేసుకునేలా చూసుకోవాలన్న ప్రభుత్వ నిబద్ధతను అనుగుణంగా ఉంటుందని తెలిపారు. ఇందులో భాగంగా ఎంసీఏ, ఆర్‌బీఐ, సెబీ, ఐఆర్‌డీఏఐ, పీఎఫ్‌ఆర్‌డీఏ, బ్యాంకులు ఉమ్మడి శిబిరాలను నిర్వహిస్తాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా ప్రారంభమైన ఈ కార్యక్రమంలో దశలవారీగా జిల్లా స్థాయి శిబిరాలను నిర్వహిస్తున్నారని, 2025 నవంబర్ 28న జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ఆడిటోరియంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉమ్మడి శిబిరం జరుగుతుందని తెలిపారు. క్లెయిమ్ చేసుకోని ఆర్థికపరమైన ఆస్తుల వాస్తవ యజమానులు వాటిని పొందేందుకు బ్యాంకు శాఖ, భీమా సంస్థ, మ్యూచువల్ ఫండ్ సంస్థ, శిభిరంలోని స్టాక్ బ్రోకరేజీ సంస్థ, ఆన్‌లైన్ ద్వారా స్టాక్ బ్రోకర్‌లలో దేనినైనా సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చునని అన్నారు. బ్యాంకుల్లో 10 సంవత్సరాలకు పైగా క్లెయిమ్ చేసుకోని డిపాజిట్ల వివరాలు ఆర్‌బీఐ ఉద్గమ్ వెబ్‌సైట్ (https://udgam.rbi.org.in) ద్వారా పొందొచ్చుని ఆయన సూచించారు.

# ఇందిర మహిళ చీరలు, వడ్డీ లేని రుణాలను పంపిణీ చేసిన ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే






మహబూబాబాద్, నవంబర్ 25 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళల ఆర్థిక అభివృద్ధి సంక్షేమం కోసం స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు పంపిణీ, ఇందిర మహిళ చీరల పంపిణీ కార్యక్రమం మంగళవారం డోర్నకల్ నియోజకవర్గంలోని కురవి మండల కేంద్రంలో ఇందిరా మహిళాశక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్ పాల్గొన్నారు. అనంతరం వడ్డీ లేని రుణాలు 48 కోట్ల 89 లక్షల ముప్పై తొమ్మిది వేల రూపాయల చెక్ పంపిణీ చేశారు, ఇందిరా మహిళ శక్తి చీరలు పంపిణీ చేసి కార్యక్రమానికి హాజరైన మహిళ సభ్యులను ఉద్దేశించి ప్రసంగించారు. కాంపెల్లి సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చింతపల్లి మరియు కందికొండ గ్రామాల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిబంధనలు అనుసరించి వరి ధాన్యం కొనుగోలు చేయాలని అధికారి వర్గాలకు సూచించారు. రైతులు ప్రభుత్వం నిర్ణయించిన రేట్లకే తమ ధాన్యాన్ని విక్రయించి ప్రయోజనం పొందాలని పిలుపునిచ్చారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యత అని, కొనుగోలు కేంద్రాల్లో తూకాలు, బస్తాలు, గోడౌన్ సౌకర్యాలు లాంటి అంశాలు పర్యవేక్షణలో ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.సి.ఓ వెంకటేశ్వర్లు, కురవి, సీరోలు తహసిల్దార్ పున్నం చందర్, విజయ, మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్,అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక అభివృద్ధికి వడ్డీ రాయితీ రుణాలు పంపిణీ

**కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే ప్రభుత్వ లక్ష్యం**

**ప్రతి మహిళ పరకాల డైరీలో భాగస్వామ్యం కావాలి**

**పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి**





హనుమకొండ, నవంబర్ 25 (తీన్మార్ న్యూస్): హనుమకొండ భవాని నగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు ఇందిరా మహిళా శక్తి మహిళా సంఘాలకు వడ్డీ లేని ఋణాలను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు.అంతకముందు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మహిళల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని,కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం అన్నారు.ఇప్పటివరకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మూడు దఫాలుగా వడ్డీ లేని రుణాలు పంపిణీ చేయడం జరిగిందని, ఇప్పుడు నాలుగో సారి ఇస్తున్నామన్నారు. ఏట 25వేల కోట్లకు తగ్గకుండా, వడ్డే లేని రుణాలు ఇస్తూ ప్రభుత్వం వడ్డీ చెల్లిస్తుందని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం మహిళా సంఘాలకు చెల్లించాల్సిన 3వేల500 కోట్ల వడ్డీ సొమ్మును ఎగవేసిందన్నారు. 4 విడుతలలో వడ్డీ లేని రుణాలు 14 కోట్లు పంపిణీ చేశామని,28880 మంది పరకాల నియోజకవర్గం మహిళలు లబ్ధి పొందారున్నారు. స్వయం సహాయక సంఘాల ఆర్థిక స్థిరత్వం, మహిళల స్వావలంబనను పెంపొందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. పరకాల మహిళా డైరీలో ప్రతి మహిళా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం వడ్డీ లేని రుణాల చెక్కులను పంపిణీ చేశారు.

# మహిళ సంఘాల రుణాలు మహిళలకు ఆర్థిక భరోసా

**ఇందిరమ్మ ఇల్లు తెలంగాణ సగటు మహిళ ఆత్మగౌరవం**

**ఆకాశమే హద్దుగా మహిళలు ఎదగాలి**


**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**

ములుగు జిల్లా, నవంబర్ 25 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వం అందించే వడ్డీ లేని రుణాలు మహిళా సంఘాల సభ్యులకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని, రుణాలను సద్వినియోగించుకొని మహిళలు ఆకాశమే హద్దుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి లతో కలిసి ములుగు నియోజకవర్గానికి చెందిన 9 మండలాల స్వయం సహాయక సంఘాలకు రెండు కోట్ల 26 లక్షల 76 వేల వడ్డీలేని రుణాల చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా సంక్షేమ పథకాలను ప్రారంభించి అంగరంగ వైభవంగా అమలు పరచడం జరుగుతుందని, ఇందిరమ్మ ఇండ్లు రాష్ట్రంలోని సగటు మహిళల ఆత్మ గౌరవంగా నిలుస్తున్నాయని స్పష్టం చేశారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా ఒక గ్రూపు సభ్యులకు 20 లక్షల రూపాయల రుణాన్ని అందించి వారిని వ్యాపారస్తులుగా తీర్చిదిద్దడం జరుగుతుందని పేర్కొన్నారు. సగటు మహిళ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, నిత్యవసరాలకు అధిక వడ్డీలతో అప్పులు తీసుకొని ఆర్థికంగా చాలా నష్టపోతున్నారని వారందరినీ దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం మహిళలపై అత్యంత నమ్మకంతో ఎలాంటి తనకా లేకుండా

వడ్డీ లేని రుణాలను మంజూరు చేయడం చాలా సంతోషకరమని తెలిపారు. మహిళా సంఘాలకు 2025–26 ఖరీఫ్ సీజన్ లో 60 ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేటాయించడం జరిగిందని వాటి ద్వారా 21,364 క్వింటాల ధాన్యాన్ని కొనుగోలు చేయనున్నారని అన్నారు. ఇందిరమ్మ ఇల్లు కట్టుకునేవారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దృష్ట్యా ప్రభుత్వం పెట్టుబడి సహాయం ద్వారా జిల్లా లో 1300 మందికి ఒక్కొక్కరికి లక్ష రూపాయలను తక్షణమే అందించగా లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణ పనులను ప్రారంభించు కున్నారని తెలిపారు. ములుగు జిల్లాలో మొత్తం 3500 ఇందిరమ్మ ఇళ్ల ను మంజూరు చేయగా, 2900 ఇండ్లు నిర్మాణం ప్రారంభం అయిందని, 600 గృహాలు స్లాబ్ నిర్మాణం వరకు పూర్తి అయ్యాయని త్వరలోనే గ్రామీణ ప్రాంతంలో ఉండే నిరుపేద మహిళలు సొంతింటి కలను నెరవేర్చుకోబోతున్నారని అన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవి చందర్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుందని రాష్ట్ర అభివృద్ధి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి స్థానిక మంత్రి ధనసరి అనసూయ సీతక్క, ఇతర మంత్రులు అహర్నిశలు శ్రమిస్తున్నారని, ఈ అభివృద్ధిలో అందరూ స్వచ్ఛందంగా భాగస్వామ్యం కావాలని కోరారు.

మహిళా సంఘాల ఆధ్వర్యంలో త్వరలో ములుగు కేంద్రంగా పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడం జరుగుతుందని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలని ప్రభుత్వ లక్ష్యం త్వరలోనే నెరవేరుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్రంలోని మహిళలందరికీ సొంత ఆడబిడ్డలుగా భావిస్తున్నారని, మహిళల కష్టాలను అర్థం చేసుకొని మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలను అందిస్తున్నారని ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ శ్రీనివాస్ రావు, ఎల్డిఎం జయ ప్రకాష్, ఏపిడి శ్రీనివాస్, జిల్లా సమాఖ్య, మండల సమాఖ్య, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల రిలే నిరాహార దీక్షకు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే గండ్ర




భూపాలపల్లి జిల్లా, నవంబర్ 25 (తీన్మార్ న్యూస్): భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న జర్నలిస్టుల రీలే నిరాహార దీక్షలో గత నాలుగు రోజులుగా భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి మరియు బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ నేను గతంలో ఎమ్మెల్యేగా ఉన్నపుడు ప్రభుత్వానికి, ప్రజలకు వారధి అయిన పోర్త్ ఎస్టేట్ అయిన జర్నలిస్ట్ సోదరులు ఇళ్ళ స్థలాలు కావాలని కోరగా ఇదే కలెక్టర్ కార్యాలయం దగ్గరలో స్థలాలు కేటాయించడం జరిగింది. తరువాత కొంతమంది జర్నలిస్ట్ సోదరులకు గణపురం మండలం, మైలారం గ్రామంలో 37 మంది జర్నలిస్ట్ సోదరులకు ఇళ్ళ స్థలాలు కేటాయించి వారికీ పట్టాలు ఆ రోజు కలెక్టర్ చేతుల మీదుగా ఇవ్వడం జరిగింది. కానీ నేటి కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్ట్ సోదరులకు కేటాయించి ఇళ్ళ స్థలాలు రద్దు చేయడం హెయమైన చర్య, జర్నలిస్ట్ సోదరులు నాలుగు రోజులుగా ఇక్కడ రీలే నిరాహార దీక్ష చేస్తూ ఇళ్ళ స్థలాలు ఇస్తే మేము ఇళ్ళు కట్టుకుంటామని చెప్పి చెప్పడం జరిగింది. కానీ ఈ రోజు ఉండేటువంటి ప్రభుత్వానికి మరి జర్నలిస్ట్ బాధలు పట్టడం లేదు.ఇక్కడ ఉండేటువంటి జిల్లా మంత్రి శ్రీధర్ బాబు ఇటు నుంచే పోతున్న కనీసం వీళ్ళ సమస్యను పట్టించుకోలేదు. ఇక్కడ ఉండే జిల్లా కలెక్టర్ రోజు ఇక్కడి నుంచే పోతావున్నాడు, మరి వీళ్ళ సమస్య పరిష్కరించాలనే ఆలోచన రాకపోవడం చాలా బాధాకరం, ఏది ఏమైనా మీరు చేస్తున్నటువంటి పోరాటం న్యాయ పోరాటం కాబట్టి తప్పకుండా మీ ఇండ్ల పట్టాలు వచ్చి మీరు ఇల్లు కట్టుకునే మరి సందర్భం వరకు మేము పూర్తిగా మరి మా పార్టీ తరుపున మీకు అండగా ఉంటామని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాం. ఇప్పటికైనా హెచ్చరిక చేస్తున్నాం ఈ ప్రభుత్వానికి, జిల్లా కలెక్టర్ కి ఎందుకంటే సమాజంలో ఫోర్త్ ఎస్టేట్ గా ఉండేటువంటి మీడియా మిత్రులను ఈ రకంగా ఇబ్బంది పెట్టడం అనేది ఈ ధర్మం కాదు. ఎందుకంటే మా ప్రభుత్వమే ప్రజా పరిపాలనని చెప్తా ఉన్నారు. మీ ప్రజా పరిపాలన లో నాలుగు రోజుల నుంచి జర్నలిస్టులు రోడ్డు మీదకు వస్తే మీకు కనబడడం లేదా మరి ఇంత నిర్లక్ష్య ధోరణి ఎందుకు. తక్షణమే మరి జర్నలిస్ట్ సోదరులకు ఇళ్ళ పట్టాలు ఇవ్వాలి. ఇవ్వకుండా ఇదే నిర్లక్ష్యం చేస్తే శాంతియుతంగా ఉండేటట్టువంటి ఉద్యమం ఇంకా మరింత తీవ్రమయ్యేటువంటి అవకాశం ఉంటది. అది భూపాలపల్లితో ఆగదు ఇది భూపాలపల్లి నుంచి మండలాలకు, మండలం నుంచి గ్రామాలకు అన్ని జిల్లాలకు కూడా విస్తరిస్తది అని హెచ్చరిక చేస్తూ, ఇప్పటికైనా తక్షణమే ఇళ్ళ పట్టాలు ఇవ్వాలని చెప్పి డిమాండ్ చేస్తున్నాం.

# కలెక్టర్ మర్యాదపూర్వకంగా కలిసిన నూతన జిల్లా ఎస్పీ



ములుగు జిల్లా, నవంబర్ 25 (తీన్మార్ న్యూస్): మంగళవారం కలెక్టర్ ఛాంబర్ లో జిల్లాకు నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన సుధీర్ రామ్ నాథ్ కేకన్ జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ను మర్యాదక పూర్వకంగా కలసి పూల మొక్కను అందించారు. అనంతరం కలెక్టర్ ఎస్పీ కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పి వచ్చే సంవత్సరం జనవరి 28 నుండి 31 వరకు జరిగే మహా జాతర విజయవంతం పై చర్చించారు.

# ఉద్యోగ అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టీ.ఎస్**



ములుగు జిల్లా, నవంబర్ 25 (తీన్మార్ న్యూస్): టాస్క్ ఆధ్వర్యంలో టెలి పర్ఫార్మెన్స్ కంపెనీలో ఉద్యోగ అవకాశాలను ములుగు జిల్లా యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ టాస్క్ కేంద్రం ఆధ్వర్యంలో టెలి పెర్ఫార్మెన్స్ కంపెనీలో ఉద్యోగ అవకాశాలను 2024 – 25 సంవత్సరంలో ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత సాధించిన యువత అర్హులని తెలిపారు. ఈ కంపెనీ ద్వారా సుమారు 100 మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని, ఆసక్తిగల యువత 9618449360 నెంబర్ ద్వారా లేదా పోస్టర్ లోని క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులకు తేది.01.12.2025 తేదీన ములుగు రీజినల్ సెంటర్ నందు సెలక్షన్ నిర్వహించబడుతుందని, ఎంపికైన అభ్యర్థులకు తొమ్మిది రోజులపాటు శిక్షణ అందించబడుతుందని అనంతరం టెలి పర్ఫార్మెన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ నందు 20వేల రూపాయల వరకు వేతనంతో ఉద్యోగ అవకాశం కల్పించబడుతుందని, ములుగు జిల్లా యువత ఈ సదా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# జిల్లా కేంద్రంలో ఉద్యమకారుల సమావేశం

**27న రౌండ్ టేబుల్ సమావేశమును విజయవంతానికి పిలుపు**

**జవ్వాజి శంకర్ ఉద్యమకారుల ఫోరం జిల్లా చైర్మన్**



జగిత్యాల, నవంబర్ 25 (తీన్మార్ న్యూస్): జగిత్యాల జిల్లా కేంద్రంలో ఉద్యమకారుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు అంశాలు మాట్లాడడం జరిగింది, అవి ఈనెల 27వ తేదీన జరిగే రౌండ్ టేబుల్ సమావేశమును విజయవంతం చేయండి. ఈనెల 27వ తేదీ హైదరాబాదులోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో మధ్యాహ్నం ఒంటి గంట నుండి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగే ఉద్యమకారులకు ఇచ్చినటువంటి హామీలను స్థానిక సంస్థల ఎన్నికల లోపు ప్రారంభించాలని జరిగే ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో జగిత్యాల జిల్లాలోని ఉద్యమకారులందరూ స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్న ఉద్యమకారులకు ఇచ్చిన హామీలపైన స్పష్టమైన ప్రకటన చేయలేదు అని ఇప్పటికైనా స్పష్టమైన ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మేనిఫెస్టో లో పెట్టినటువంటి అంశాలను ఆయన గుర్తు చేశారు.

1. ఉద్యమకారులను గుర్తించడానికి ప్రత్యేక కమిటీ వేస్తామన్నారు. ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు జారీ చేస్తామని అన్నారు.
2. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇస్తామన్నారు.
3. జారండ్ రాష్ట్ర తరహాలో ప్రతి ఉద్యమకారులకు 25వేల పెన్షన్ ప్రతినెలా కల్పిస్తామన్నారు.
4. ఉచిత రైల్వే బస్సు సౌకర్యాలను కల్పిస్తామన్నారు
5. పదివేల కోట్లతో సంక్షేమ నిధిని ఏర్పాటు చేస్తామన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే మరో పోరాటానికి ఉద్యమకారులు అందరు కూడా సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో చైర్మన్ జవ్వాజి శంకర్ వైస్ చైర్మన్ రాష్ట్ర కార్యదర్శి గాజుల శ్రీనివాస్ గౌడ్,తన్నీర్ సత్యం రావు,వైస్ చైర్మన్ రాగుల రాజు, ప్రధాన కార్యదర్శి భారతపు లింగారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉమేందర్ కొండ్రా ప్రేమ్ కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌లో భారీగా యువత చేరికలు





భూపాలపల్లి, నవంబర్ 25 (తీన్మార్ న్యూస్): భూపాలపల్లి జిల్లా పార్టీ కార్యాలయంలో భూపాలపల్లి మండలం, గొర్లవీడు గ్రామ వాస్తవ్యులు, కాంగ్రెస్ పార్టీ మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు ధరణి రమణా చారి మరియు భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 8వ మరియు 27వ వార్డు జవహర్ నగర్ కాలనీలో మహిళలు మరియు యువత మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ రేవంత్ రెడ్డి అబద్దాల పునాదులపై ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు జరుగుతున్న అన్యాయంపై కేసిఆర్, కేటీఆర్ నాయకత్వంలో చేస్తున్న పోరాటంలో మేము కూడా భాగస్వాములం అవుతాం, బిఆర్ఎస్ తోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేకూరుతుంది అనే దృఢ విశ్వాసంతో జవహర్ నగర్ యువత, మహిళలలు బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్న సందర్భంగా వారికీ పార్టీలోకి ఆహ్వానిస్తూ పార్టీ బలోపేతానికి, కాంగ్రెస్ పార్టీ వ్యతిరేక విధానాలను ఎక్కడికక్కడ ఎండగడుతూ ముందుకు సాగుద్దామని పిలుపునిచ్చారు. కార్యకర్తలకు ఇబ్బంది కలిగిస్తే మేము చూస్తూ ఊరుకోం ఒక ఫోన్ కాల్ చేస్తే చాలు అది ఎప్పుడైనా ఏ అర్ధ రాత్రి అయినా మీకు అండగా ఉంటామని మీ అందరికీ మరొక్కసారి భరోసా ఇస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు శ్రీకాంత్, నగేష్, నాగరాజు, అజయ్, సంపత్, యన్ శ్రీకాంత్, శివ శంకర్, శివ చరణ్, హరీష్, బంటీ, రాఘవ, మహేందర్, మనోహర్, అన్వేష్, మణి, కార్తీక్, రాహుల్, పండు, రేవంత్, భరత్, అఖిల్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## యశోద హాస్పిటల్లో గర్భిణీకి అరుదైన చికిత్స

### తల్లీ బిడ్డల ప్రాణాలు రక్షించిన సీనియర్ గైనకాలజిస్ట్

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ దాసరి లేపాక్షి



నల్లగొండ, నవంబర్ 25 (తీన్మార్ తీన్మార్ న్యూస్): హైద్రాబాద్లోని మలక్పేట యశోద హాస్పిటల్లో గర్భిణీకి అరుదైన చికిత్స చేసి తల్లీ బిడ్డల ప్రాణాలు రక్షించినట్టు సీనియర్ గైనకాలజిస్ట్ లేపాక్షి దాసరి తెలిపారు. ఆమె మంగళవారం జిల్లా కేంద్రంలోని మనోరమ హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నల్లగొండకు చెందిన ఊర్మిళ అనే గర్భిణీ ప్లాసెంటా అక్రెటా కేసుతో యశోద ఆస్పత్రికి వస్తే ఆమె సీనియర్ వైద్యులైన గైనకాలిజిస్టులతో పాటు యూరాలజీ, అనస్థీషియా సహకారంతో ఇద్దరికి ఎలాంటి అపాయం లేకుండా శస్త్ర చికిత్స చేసి సఫలమైనట్లు తెలిపారు. ఐవీఎఫ్ ద్వారా గర్భం దరించిన సదరు మహిళ ప్లాసెంటా ప్రీవియా, అక్రెటా, ప్రీ గెస్టేషనల్ దయాబెటిస్, హైపోథైరాయిడిజం, హైపర్ టెన్షన్తో హాస్పటల్కు వచ్చినట్లు తెలిపారు. అయితే ఆమెకు ప్లాసెంటా అక్రెటాతో పాటు కడుపులో టీబీ కారణంగా ద్వారా బిగుసుకుపోయి కొయ్యబారిపోవటంతో శస్త్ర చికిత్స మాకు సవాలుగా మారినట్లు తెలిపారు. అయితే ఆ సమయంలో అయితే పరీక్షల్లో ఎలక్టివ్ ఎల్ఎస్సీఎస్ చేస్తే ప్లాసెంటా పూర్తిగా అతుక్కోని పోయి ఉండటం వల్ల సబ్టోటల్ సిజేరియన్ హిస్ట్రక్టమీ చేసి గర్భాశయాన్ని సైతం తొలగించినట్లు తెలిపారు. ప్లాసెంటా అక్రెటా ఉన్నప్పుడు రక్తస్రావం ఎక్కువగా అవుతుందని, ఫ్రొజెన్ పెల్విన్ ఉన్నప్పటికి సకాలంలో హైరిస్క్ చేసి శస్త్ర చికిత్స చేయటం వల్ల ఎలాంటి ఇబ్బంది లేకుండా సత్ఫలితాన్ని ఇచ్చినట్లు తెలిపారు. ఈ సమావేశంలో లక్ష్మణ్ శ్రీకాంత్, వాసుకిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలపై బీజేపీ అధిష్టానం దృష్టి

తెలంగాణ బ్యూరో, నవంబర్ 25 (తీన్మార్ న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికలపై బీజేపీ అధిష్టానం దృష్టి సారించింది. ఎన్నికలకు త్వరలో మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేలుగా పోటీ చేసిన వారికి కీలక బాధ్యతలు అప్పగించనున్నారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో సర్పంచ్‌లుగా, వార్డు మెంబర్లుగా బీజేపీ అభ్యర్థులు పోటీ చేయాలని నిర్ణయించారు. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలు కావడంతో సర్పంచ్ పదవులకు పోటీచేసే నేతలు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. తాజా రిజర్వేషన్ల మార్పుతో తమకు అనుకూలంగా మారడంతో ప్రజల మెప్పు కోసం ప్రయత్నాలు మొదలు పెట్టారు.

# తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ పై ఉన్నత స్థాయి సమీక్షలు

## కంట్రోల్ సెంటర్‌లో వేదికగా వరుసగా రివ్యూ మీటింగ్స్

తెలంగాణ బ్యూరో, నవంబర్ 25 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025 నిర్వహణ, ఏర్పాట్లపై ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి క్షేత్రస్థాయిలో వరుసగా సమీక్షలు చేపడుతున్నారు. మరోవైపు 'తెలంగాణ రైజింగ్-2047' డాక్యుమెంట్‌కు అధికారులు తుది మెరుగులు దిద్దుతున్నారు. మంగళవారం నుంచి నవంబర్ 30 వరకు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వేదికగా వరుసగా రివ్యూ మీటింగ్స్ జరగనున్నాయి. సీఎం రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి దండే శ్రీధర్ బాబు వరుసగా జరిగే అన్ని సమీటింగ్స్‌లో పాల్గొంటారు.

**సమీక్షల షెడ్యూల్ వివరాలు ఇలా**

నవంబర్ 26: లాజిస్టిక్స్ ఏర్పాట్లపై రివ్యూ

పాల్గొనే వారు: సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, దానం నాగేందర్ (సీతక్క), సంబంధిత అధికారులు

**నవంబర్ 27: మౌలిక వసతులు, అభివృద్ధిపై సమీక్ష**

పాల్గొనే వారు: సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు హెచ్. వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, దానం నాగేందర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సంబంధిత అధికారులు

**నవంబర్ 28:**

- సాయంత్రం 4 గంటలకు - విద్య, యువజన సంక్షేమం
- పాల్గొనే వారు: మంత్రులు వాకిటి శ్రీహరి, హెచ్. వివేక్ వెంకటస్వామి, సంబంధిత అధికారులు
- సాయంత్రం 6 గంటలకు - టూరిజం, టెంపుల్ టూరిజం
- పాల్గొనే వారు: మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, సంబంధిత అధికారులు

**నవంబర్ 29:**

- సాయంత్రం 4 గంటలకు - వ్యవసాయం, సంక్షేమ విభాగాలు
- పాల్గొనే వారు: మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి
- సాయంత్రం 6 గంటలకు - మైనారిటీ, గిరిజన సంక్షేమం మొదలైనవి
- పాల్గొనే వారు: మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దానం నాగేందర్ (సీతక్క)
- నవంబర్ 30: ఆరోగ్య రంగం
- పాల్గొనే వారు: సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర రాజనరసింహ, సంబంధిత శాఖ అధికారులు పాల్గొంటారు.

# గోదావరి పుష్కరాలకు ముహూర్తం ఖరారు

**2027 జూలై నుండి ఆగస్టు 3 వరకు పుష్కరాలు**

**పుష్కరాల కోసం కేంద్రం రూ.100 కోట్ల ప్రకటన**

**రైల్వే భక్తుల సౌకర్యాల కోసం రూ.271.43 కోట్ల కేటాయింపు**



తెలంగాణ బ్యూరో, నవంబర్ 25 (తీన్మార్ న్యూస్): గోదావరి పుష్కరాలకు ముహూర్తం ఖరారు అయ్యింది. 2027 జూలై నుండి ఆగస్టు 3 వరకు గోదావరి పుష్కరాలను నిర్వహించనున్నారు. ఇప్పటికే పుష్కరాల కోసం కేంద్ర ప్రభుత్వం రూ.100 కోట్ల నిధులను ప్రకటించింది. కాగా తాజాగా రైల్వే శాఖ పుష్కరాలకు వచ్చే భక్తుల సౌకర్యాల కోసం రాజమండ్రి రైల్వే స్టేషన్‌కు రూ.271.43 కోట్లు కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. దేశంలోని వివిధ ప్రాంతాల నుండి రాజమండ్రికి ప్రత్యేక రైళ్లు నడుతపుతామని ఇప్పటికే ప్రకటించింది.

మరోవైపు కేంద్రంతో పాటు ఏపీ ప్రభుత్వం సైతం పుష్కరాల కోసం ఏర్పాట్లను మొదలు పెట్టింది. రాష్ట్రప్రభుత్వం కమిటీల ఏర్పాటుతో పాటు నిధులను విడుదల చేసింది. కుంభమేళా తరహాలో ఘాట్లు మరియు వసతి ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. నదిలో అందరూ ఒకేదగ్గర స్నానాలు చేయాలి అనేలా కాకుండా ఎక్కడైనా స్నానాలు చేసేలా ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం 17 ఘాట్లు ఉండగా 75,11,616 మంది భక్తులు వస్తారని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

# బలవంతంగా గేమింగ్, బెట్టింగ్ యాప్స్ లోకి "యూజర్ల రీడైరెక్షన్"

మొదటి పేజీ తరువాయి




అడిషనల్ సీపీ శ్రీనివాస్ ఈ కేసుకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ రూపంలో కీలక విషయాలు వెల్లడించారు. రవి సినిమాల పైరసీతో పాటే బెట్టింగ్ ప్రమోషన్ కూడా చేశారని గేమింగ్, బెట్టింగ్ యాప్ ద్వారా రవికి డబ్బులు వచ్చేవన్నారు. యాడ్ బుల్ అనే బెట్టింగ్ కంపెనీ రవికి చెందినదేనని ఈ కంపెనీకి డాలర్ల రూపంలో డబ్బ వచ్చేదని తెలిపారు. రవి సర్వర్లన్నీ నెదరలాండ్స్‌లో ఉన్నాయని రవి టీం ఇంకా కరేబియన్ దీవుల్లోనే ఉందన్నారు. హైదరాబాద్, వైజాగ్‌లో రవి ఆస్తుల్ని గుర్తించాం. ఇప్పటిదాకా రూ.3 కోట్లు సీజ్ చేశామని చెప్పారు. రవి సోలో లైన్ జీవిస్తున్నారని అమెరికాలో ఆయన సోదరి ఉంటోంది. ఆమెకు గాని కుటుంబ సభ్యులకు గానీ రవి డబ్బులు పంపించినట్లు ఎక్కడా ఆధారాలు లభించలేదన్నారు. మరికొన్ని పైరసీ వెబ్‌సైట్లు నడుస్తూనే ఉన్నాయని మూవీరూల్జ్, తమిళ్‌ఎంవీ లాంటి పలు పైరసీ వెబ్‌సైట్లు నడుస్తున్నాయని చెప్పారు. వీటి నుంచి రవి సినిమాలను సేకరించేవాడని తెలిపారు. వాటి క్వాలిటీ సరిగా లేకుంటే క్వాలిటీ పెంచుకునే సాఫ్ట్ వేర్ కూడా రవి వద్ద ఉందన్నారు.

**రవిని పట్టించింది భార్య కాదు.. అతని వల్లే పట్టుకున్నాం:**

రవిని పోలీసులు పట్టుకోవడం వెనుక అతడి భార్య టిప్ అందించారని వస్తున్న సమచారారాన్ని అడిషనల్ సీపీ ఖండించారు. రవి భార్య మాకు ఇప్పటి వరకు కాంటాక్ట్‌లో లేరని నిజానికి రవి మాకు దొరుకుతాడనే గ్యారెంటీ కూడా లేకుండేనని చెప్పారు. పోలీసులకు రవి చాలెంజ్ చేశాక ఒక్కో లీడ్ ను విశ్లేషించుకుంటూ వెళ్తున్న క్రమంలోరవికి నిఖిల్ అనే మిత్రుడు ఉన్నాడని అతడి నంబర్ మాకు దొరికిందని దాన్ని విశ్లేషించడం ద్వారా రవి దొరికాడన్నారు. ఐ బొమ్మ, బొప్పం వెబ్ సైట్ కు ఈ నిఖిల్ డిజైన్లు చేశారని తెలిపారు. రవిని పట్టుకోవడం వెనుక పోలీసుల కృషి మాత్రమే ఉందని ఎవరు మాకు సమాచారం ఇవ్వలేదన్నారు. సోషల్ మీడియాలో రవికి వస్తున్న మద్దతు తమకు తెలియదని సీపీ చెప్పారు. రవికి మద్దతు తెలుపుతున్నారనే వారు ఐ బొమ్మలో ఉచితంగా సినిమాలు చూడవచ్చు. ఒక సినిమా చూస్తే రూ. వెయ్యి పోతుందేమో కానీ మీ లక్షల విలువైన వ్యక్తిగత డాటా వారి చేతుల్లోకి వెళ్తోందని ఇది గమనించాలన్నారు. రవి ప్రతివారం ఒక్కో దేశానికి ట్రావెల్ చేసేవాడని అతనికి జాబ్ చేసే ఉద్దేశం లేదని ఈజీ మనీ కోసమే ఈ విధానాన్ని ఎంచుకున్నట్లు తమతో చెప్పాడన్నారు. రవిపై ఉన్న మిగతా కేసులపై పీటీ వారెంట్ వేస్తామన్నారు. ఒక సందర్భంలో గెట్టింగ్ అప్ అనే యాప్‌లో హోస్టింగ్ కు సంబంధించి సైబర్ ఇన్ స్పెక్టర్ మెయిల్ పెడితే దానికి రవినే బ్యాక్ ఎండ్లో సమాధాం ఇచ్చారని సీపీ తెలిపారు. అయితే మీ వద్ద ఏం ఆధారాలు ఉన్నాయని తమనే ప్రశ్నించాడు. దాంతో తమకు సందేహం కలిగి రివర్స్ ఇంజనీరింగ్ చేయడంతో అతడు దొరికాడన్నారు.

**మూడు బొమ్మల్లో 'ఐ బొమ్మ':**

బొమ్మ, బప్పం వెబ్ సైట్ల డొమైన్లను రవి తన క్రెడిట్ కార్డు, ఈమెయిల్ ఐడీలను ఉపయోగించాని పోలీసులు తెలిపారు. దీని వల్ల ఐ బొమ్మ, బప్పం వెబ్ సైట్లు తనవి కాదని తప్పించుకోలేదన్నారు. ఐబొమ్మలో సినిమా చూద్దామని వెళ్తే ఓపెన్ చేసే యూజర్లను గేమింగ్, బెట్టింగ్ వెబ్ సైట్లకు రీడైరెక్షన్ చేస్తారని అలా ఏర్పడిన ట్రాఫిక్ తో యాడ్ అడ్వర్టైజ్ క కంపెనీలు రవికీ చెందిన యాడ్ బుల్ కంపెనీకి డబ్బులు చెల్లించేవని వెల్లడించారు. ఇలా రవి ఐ బొమ్మకు వచ్చిన యూజర్లను బలవంతంగా గేమింగ్, బెట్టింగ్ యాప్ లకు రీడైరెక్షన్ చేసి డబ్బులు సంపాదించాడని తెలిపారు. రవి డివైజ్ లలో మిలియన్ల కొద్ది బైట్ల డేటా ఉందని వాటిని రిట్రీట్ చేసి అనాలసిస్‌కు చాలా టైమ్ పడుతుందన్నారు. ఇలా మూడు దశల్లో రవి యూజర్లను ఉపయోగించుకుని క్యాష్ చేసుకున్నాడని తెలిపారు.

# జీహెచ్ఎంసీలో మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల విలీనం

మొదటి పేజీ తరువాయి

తీసుకున్నారు. రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్ విద్యుత్ అవసరాలు, పరిశ్రమల వృద్ధి, నగర పాలన సంస్కరణలు, మౌలిక సదుపాయాల విస్తరణ అన్నింటినీ దృష్టిలో పెట్టుకొని కేబినెట్ విస్తృత చర్చలు జరిపింది. ముఖ్యంగా హైదరాబాద్ చుట్టూ వేగంగా పెరుగుతున్న అర్బన్ అభివృద్ధిని క్రమబద్ధీకరించేందుకు, విద్యుత్ సరఫరా వ్యవస్థను బలోపేతం చేసేందుకు తీసుకున్న నిర్ణయాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

1. హైదరాబాద్ తెలంగాణ కోర్ అర్బన్ ఏరియా పరిధిలో ఉన్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లన్నీ జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఔటర్ రింగ్ రోడ్ లోపల బయట, ఓఆర్ఆర్ ను ఆనుకొని ఉన్న 27 అర్బన్ లోకల్ బాడీస్ (మున్సిపాలిటీ, కార్పొరేషన్లను) జీహెచ్ఎంసీ లో విలీనం చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అందుకు అవసరమైన జీహెచ్ఎంసీ యాక్ట్, తెలంగాణ మున్సిపల్ యాక్ట్ లకు సవరణలు చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

2. రాష్ట్రంలో ఇప్పుడున్న ఎన్పీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ రెండు డిస్కమ్లతో పాటు కొత్తగా మూడో డిస్కమ్ ఏర్పాటు చేసేందుకు మంగళవారం మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో ఉన్న వ్యవసాయ కనెక్షన్లు, లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్స్, మిషన్ భగీరథ, సురక్షిత మంచి నీటి పథకాలు, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లయ్ సీవరేజ్ బోర్డ్ పవర్ కనెక్షన్లన్నీ కొత్త డిస్కమ్ పరిధిలోకి వస్తాయి.

3. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్, రాబోయే పదేండ్లకు అవసరమయ్యే విద్యుత్తు సరఫరా, విద్యుత్తు ఉత్పత్తి అంచనాలను కేబినేట్ సమగ్రంగా చర్చించింది. విద్యుత్తు విభాగం అధికారులు సమగ్రంగా సమర్పించిన పవర్ పాయింట్ ప్రజంటేషన్ను పరిశీలించింది.

పునరుత్పాదక విద్యుత్తు వినియోగం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నిబంధనల ప్రకారం రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ వినియోగాన్ని పెంచేందుకు మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా 3000 మెగా వాట్ల సోలార్ పవర్ కొనుగోలుకు వీలైనంత తొందరగా టెండర్లు పిలవాలని నిర్ణయం తీసుకుంది. అయిదు ఏళ్ల పాటు విద్యుత్ సరఫరా చేసే కాల పరిమితి ఒప్పందాలతో ఈ టెండర్లు పిలవాలని కేబినెట్ నిర్ణయించింది.

4. సోలార్ పవర్ తరహాలోనే పంప్డ్ స్టోరేజ్ పవర్ వినియోగం పెంచాల్సి ఉంది. 2000 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ పవర్ కొనుగోలుకు టెండర్లు పిలవాలని నిర్ణయం తీసుకుంది. అయిదేళ్ళ కాల పరిమితితోనే ఈ టెండర్లు కూడా పిలవాలని కేబినెట్ నిర్ణయించింది. రాష్ట్రంలో పలు చోట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రాంతాలున్నాయి. పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్లను నెలకొల్పేందుకు ముందుకు వచ్చే కంపెనీలు, పెట్టుబడిదారులకు అనుమతి ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.



ఇప్పటికే డిస్కమ్ల వద్ద ఉన్న ఎంవోయూలను కూడా పరిశీలించాలని నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో 10 వేల మెగా వాట్ల పంప్డ్ స్టోరేజ్ విద్యుత్తు ఉత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు అనుమతులు ఇవ్వాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ ప్లాంట్ల ఏర్పాటుకు ఆసక్తి ప్రదర్శించే కంపెనీలకు ప్రభుత్వమే అవసరమైన భూమిని కేటాయించి, నీళ్లను అందిస్తుంది. ఈ ప్లాంట్లలో ఉత్పత్తి చేసే విద్యుత్ ను ముందుగా మన డిస్కమ్ లకే అమ్మాలనే షరతుతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంటుంది.

5. రాష్ట్రానికి వచ్చే కొత్త పరిశ్రమలు, పెట్టుబడులను ఆకర్షించేందుకు క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ లో భాగంగా రాష్ట్ర మంత్రివర్గం మరో కీలకమైన నిర్ణయం తీసుకుంది. కొత్తగా స్థాపించే పరిశ్రమలు తమకు అవసరమైన విద్యుత్తును తమతంట తామే సొంతంగా ఉత్పత్తి చేసుకునేందుకు అవకాశం కల్పించింది.

కొత్త పరిశ్రమలు క్యాప్టివ్ పవర్ జనరేషన్ కు అప్లై చేసుకుంటే వెంటనే అనుమతి ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. ఇందులో విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యానికి సంబంధిత ఎలాంటి గరిష్ఠ పరిమితి లేదు. ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలకు ఇప్పుడున్న విధానంలోనే విద్యుత్ సరఫరా జరుగుతుంది.

6. రామగుండం థర్మల్ పవర్ స్టేషన్లో కొత్తగా నిర్మించే 800 మెగావాట్ల ప్లాంట్ ను ఎన్టీపీసీ అధ్వర్యంలో చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. పాల్వంచ, మక్తల్ లోనూ ఎన్టీపీసీ అధ్వర్యంలో విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించింది.

ఎన్టీపీసీ కి ఈ యూనిట్ నిర్మాణం అప్పగిస్తే ఎంత విద్యుత్ యూనిట్ రేట్ పడుతుంది. జెన్ కో ద్వారా చేపడితే ఎంత రేట్ పడుతుందో ముందుగా అంచనాలు వేసుకొని తుది పరిశీలన చేయాలని కేబినెట్ నిర్ణయించింది.

7. హైదరాబాద్ లో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే బెంగుళూరు లో అండర్ గ్రౌండ్ విద్యుత్తు కేబుల్ సిస్టమ్ ఉంది. ఇటీవలే అక్కడ అమలు చేసిన విధానాన్ని అధికారులు అధ్యయనం చేసి వచ్చారు. అక్కడ అమలు చేసిన విధానం ప్రకారం జీహెచ్ఎంసీ పరిధిలో అండర్ గ్రౌండ్ కేబుల్ సిస్టమ్ ఏర్పాటుకు దాదాపు రూ. 14 వేల 725 కోట్ల ఖర్చు అవుతుందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

హైదరాబాద్ సిటీని విద్యుత్ సర్కిళ్ల వారీగా మూడు విభాగాలుగా విభజించుకొని ఈ ప్రాజెక్ట్ చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. విద్యుత్ తో పాటు టీ ఫైబర్, వివిధ కేబుల్ నెట్వర్క్ వైర్లన్నీ అండర్ గ్రౌండ్లోనే ఉండేలా చేయాలని, ఆ కంపెనీలతో సంప్రదింపులు జరపాలని నిర్ణయం తీసుకుంది. అందుకు సంబంధించి వర్కింగ్ ప్లాన్ రెడీ చేయాలని అధికారులను ఆదేశించింది.

8. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం పెద్ద నల్లబెల్లి గ్రామంలో ఎస్సీ, ఎస్టీ బీసీ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి 20.28 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

9. ములుగు జిల్లా ములుగు మండలంలోని జగ్గన్నపేట గ్రామంలో స్పోర్ట్ స్కూల్ ఏర్పాటు చేసేందుకు 40 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

10. జూబ్లీ హిల్స్ నియోజకవర్గంలో కొత్తగా అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఇప్పుడున్న 56 ఏటీసీ లతో పాటు కొత్తగా 6 ఐటీఐలలో ఏటీసీ లను ఏర్పాటు చేయాలని నిర్ణయం.

# జీవో రాకముందే బయటికి చేరవేత



మొదటి పేజీ తరువాయి

సెక్రటేరియట్‌లో జరిగిన కేబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు శ్రీధర్ బాబు స్పందిస్తూ ఈ లీకుల విషయం మీడియా ద్వారా తమ దృష్టికి వచ్చిందని కేబినెట్ నిర్ణయాలు, ప్రభుత్వ నిర్ణయాల లీక్‌లపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయంలో కేబినెట్ సైతం ఇదే ఆలోచనతో ఉందన్నారు. కేబినెట్ నిర్ణయాలు చాలా కాన్ఫిడెన్షియల్ అని అలాంటిది ఇంకా జీవోలు రాకముందే వాటి సారాంశం ఇతరులకు చేరవేడం అంటే అలాంటి ఘటనలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. కాగా, కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలు, చర్చల సారాంశం మొత్తం గులాబీ లీడర్లకు వెంటనే చేరుతున్నట్టు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. ఈ మధ్య జరిగిన కేబినెట్ సమావేశంలో హైదరాబాద్‌లో ఉన్న పరిశ్రమలను ఔటర్ రింగ్‌రోడ్డు అవతలకు తరలించాలని నిర్ణయించారు. అందుకోసం పరిశ్రమల శాఖ రూపొందించిన 'హిల్టప్' పాలసీని ఆమోదించారు. అయితే ఈ పాలసీకి సంబంధించిన విధివిధానాలు తయారు చేసి ఆ శాఖ సెక్రెటరీ ఆమోదించిన తర్వాత జీవో ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఆ లోపే కొందరు ఆఫీసర్లు డిటెయిల్స్ అన్నీ గులాబీ పార్టీ నేతలకు చేరవేసినట్టు ప్రచారం జరుగుతున్నది. వాటిని ఆధారంగా చేసుకుని సర్కారుపై కేటీఆర్ విమర్శలు గుప్పించారు. ఇండస్ట్రీ భూముల బదిలీ పేరుతో రూ.లక్షల కోట్ల స్కామ్‌కు కాంగ్రెస్ పాలకులు తెరలేపారని ఆరోపించారు. ఈ లీకు విషయంలో దిశ దినపత్రిక సైతం పరిశ్రమల శాఖలో బీఆర్ఎస్ కోవర్టులు! అంటూ ఈ నెల 22వ తేదీన ఓ కథనం ప్రచురించింది. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారంపై స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు పై వ్యాఖ్యలు చేశారు.

# కర్రిగుట్టల వద్ద మరో సీఆర్పీఎఫ్ బేస్ క్యాంప్






ములుగు, నవంబర్ 25 (తీన్మార్ న్యూస్): వచ్చే ఏడాది మార్చి 31 నాటికి దేశంలో మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా పని చేస్తున్నామని కేంద్రం ప్రకటించిన వేళ మావోయిస్టులకు కంచుకోటగా ఉన్న కర్రిగుట్టల విషయంలో భద్రతాబలగాలు మరో కీలక ముందడగు వేశాయి. ములుగు జిల్లా వాజేడు మండలం మోర్మూరు వద్ద మంగళవారం సీఆర్పీఎఫ్ మరో బేస్ క్యాంప్ ఏర్పాటు చేసింది. నూతనంగా ఏర్పాటు చేసిన సీఆర్పీఎఫ్ 39 బెటాలియన్‌ను సీఆర్ పీఎఫ్ ఐజీ త్రివిక్రమ్ ఐపీఎస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కర్రిగుట్టలపై తమ తదుపరి లక్ష్యాన్ని వివరించారు. కర్రిగుట్టలపై అతితక్కువ కాలంలో పట్టు సాధించామని నక్సలిజం ఫ్రీ ఇండియా దిశగా ఇది మరో ఒక ముఖ్యమైన ముందడుగు అడుగు అన్నారు. ఈ ప్రాంతాన్ని సేఫ్ ప్లేస్ గా తీర్చిదిద్దుతామని చెప్పారు. త్వరలో కర్రిగుట్టలపై రోడ్ వే ఏర్పాటు చేసి పైన కూడా సీఆర్పీఎఫ్ క్యాంపు ఏర్పాటు చేస్తామని చెప్పారు. కర్రిగుట్ట ప్రాంతంలో అభివృద్ధి జరిగేలా ప్రజలు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

**కర్రెగుట్టలో 14 ఐఈడీలు:**

ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా ఊసూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కర్రెగుట్టలోని తడపల కొండల్లో ఏర్పాటు చేసిన ఎఫ్ఓబీ (ఫార్వర్డ్ ఆపరేటింగ్ బేస్) క్యాంపు బలగాలు పెద్ద ఎత్తున సెర్చ్ ఆపరేషన్ నిర్వహించి కర్రిగుట్టల్లో 14 ఐఈడీలను గుర్తించారు. కాగా మావోయిస్టుల ఏరివేతలో భాగంగా తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దులో ఉన్న కర్రిగుట్టలపై కేంద్ర బలగాలు ఫోకస్ పెట్టాయి. సుదీర్ఘ కాలంగా మావోయిస్టులకు పెట్టని కోటగా ఈ ప్రాంతం ఉండటంతో ఆపరేషన్ కగారులో భాగంగా భద్రతా దళాలు ఇటువైపు ఫోకస్ చెశాయి. ఈ ఏడాది జులైలో ఆపరేషన్ కర్రిగుట్టలు / ఆపరేషన్ బ్లాక్ ఫారెస్టు పేరుతో పేరుతో కర్రిగుట్టల కొండల చుట్టూ ఉన్న దట్టమైన అడవుల్లో కేంద్ర, రాష్ట్ర భద్రతాదళాలు 21 రోజుల ఆరపరేషన్ నిర్వహించాయి. ఇందులో భాగంగా 31 మంది నర్సల్స్ ను అంతమొందించాయి. ఈక్రమలోనే మే నెలలో మావోయిస్టు ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావును ఎన్ కౌంటర్ చేయడం ఆపరేషన్ కగారులో భద్రతా దళాలు సాధించిన అతిపెద్ద విజయంగా చెబుతున్నారు. ఈ క్రమంలోనే ఈ కర్రిగుట్టలను పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకునేందుకు భద్రతా బలగాలు ఈ కర్రిగుట్టలను అష్టదిగ్బంధనం చేసే ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ఈ ప్రాంతంలో ఇప్పటికే పలు బేస్ క్యాంపులు ఏర్పాటు చేసిన బలగాలు మరింత ముందుకు దూసుకుపోయేలా కొత్త బేస్ క్యాంపులను ఏర్పాటు చేసుకుంటోంది.

# కోడిగుడ్లను రోజులో అసలు ఏ సమయంలో తింటే మంచిది..? ఉదయం, మధ్యాహ్నం లేదా రాత్రి..?

కోడిగుడ్లలో ఒక్క విటమిన్ సి తప్ప అన్ని పోషకాలు ఉంటాయి. అందుకనే కోడిగుడ్లను సంపూర్ణ పౌష్టికాహారంగా పిలుస్తారు. రోజు ఒక కోడిగుడ్డును తినాలని పోషకాహార నిపుణులు, వైద్యులు సూచిస్తుంటారు. కోడిగుడ్లను రోజూ ఒకటి చొప్పున తినడం వల్ల అనేక లాభాలు కలుగుతాయి. కోడిగుడ్ల ద్వారా పూర్తి స్థాయిలో పోషకాలను పొందాలంటే వాటిని ఉడకబెట్టి తినడమే ఉత్తమమైన మార్గం అని కూడా సూచిస్తుంటారు. అయితే కోడిగుడ్లను తినడం వల్ల అనేక పోషకాలను పొంది పోషకాహార లోపం నుంచి బయట పడవచ్చు. కానీ గుడ్లను రోజులో అసలు ఏ సమయంలో తినాలి, వీటిని ఉదయం, మధ్యాహ్నం లేదా సాయంత్రం.. ఏ సమయంలో తింటే మనకు ఎక్కువ పోషకాలు లభిస్తాయి, ఏ సమయంలో వాటిని తినడం వల్ల ఎక్కువ మేలు జరుగుతుంది..? అని చాలా మంది ఆలోచిస్తుంటారు. అయితే ఇందుకు పోషకాహార నిపుణులు సమాధానాలు చెబుతున్నారు.



**జింక్ అధికంగా..**

కోడిగుడ్లను ఉడికించేందుకు సాధారణంగా చాలా తక్కువ సమయం పడుతుంది. ఒక కోడిగుడ్డు పూర్తిగా హార్డ్ బాయిల్ అయ్యేందుకు సుమారుగా 10 నిమిషాల సమయం పడుతుంది. కనుక వీటిని చాలా త్వరగా ఉడికించవచ్చు. ఇక గుడ్లలో అనేక పోషకాలు ఉంటాయి. ముఖ్యంగా జింక్ అధికంగా ఉంటుంది. ఇది తెల్ల రక్త కణాలు ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దగ్గు, జలుబు వంటి సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. జింక్ వల్ల పురుషుల్లో శృంగార సామర్థ్యం పెరుగుతుంది. వీర్యం ఉత్పత్తి అవుతుంది. శుక్ర కణాల కదలికలు సరిగ్గా ఉంటాయి. దీని వల్ల సంతానం కలిగే అవకాశాలు మెరుగు పడతాయి. కోడిగుడ్లలో ఉండే మెగ్నిషియం కండరాలను ప్రశాంతంగా మారుస్తుంది. కండరాల నొప్పులను తగ్గించి కండరాలకు బలం కలిగేలా చేస్తుంది. దీంతో కండరాలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి.

**శక్తి స్థాయిలకు..**

కోడిగుడ్లలో ఐరన్ కూడా అధికంగానే ఉంటుంది. ఇది హిమోగ్లోబిన్ ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. రక్తం వృద్ధి చెందేలా చూస్తుంది. దీంతో రక్తహీనత తగ్గుతుంది. అలాగే నీరసం, అలసట తగ్గుతాయి. యాక్టివ్‌గా ఉంటారు. ఉత్సాహంగా పనిచేస్తారు. కోడిగుడ్లను తినడం వల్ల ప్రోటీన్లను అధికంగా పొందవచ్చు. దీని వల్ల శరీరానికి శక్తి లభించి చురుగ్గా పనిచేస్తారు. శరీరంలో శక్తి స్థాయిలు అధికంగా ఉంటాయి. బద్దకం తగ్గిపోతుంది. కోడిగుడ్లను తినడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. ఇలా కోడిగుడ్లను రోజువారి ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

**ఎప్పుడు తినాలి..?**

ఇక కోడిగుడ్లను ఉదయం తినడం వల్ల ఎక్కువ లాభాలు ఉంటాయని సైంటిస్టుల అధ్యయనాల్లో తేలింది. ముఖ్యంగా ఉదయం వ్యాయామం చేసిన అనంతరం గుడ్లను తింటే శరీరానికి శక్తి లభించి యాక్టివ్‌గా ఉంటారు. రోజంతా చురుగ్గా పనిచేయగలుగుతారు. రోజంతా శారీరక శ్రమ చేసేవారు కూడా ఉదయం గుడ్లను తింటే మేలు జరుగుతుంది. ఎక్కువ సేపు పనిచేయగలుగుతారు. నీరసం, అలసట రాకుండా ఉంటాయి. అయితే కోడిగుడ్లను ఉడకబెట్టి తింటే ఎక్కువ మేలు జరుగుతుంది. ఇక శక్తి పెద్దగా అవసరం లేదని భావించేవారు గుడ్లను మధ్యాహ్నం ఉడకబెట్టి తినవచ్చు. అయితే కోడిగుడ్లను రాత్రి పూట తినకూడదు. తింటే శరీరంలో అనవసరంగా క్యాలరీలు, కొలెస్ట్రాల్ చేరుతాయి. ఇవి మనకు హాని చేస్తాయి. కనుక కోడిగుడ్లను ఉదయం లేదా మధ్యాహ్నం మాత్రమే తినాల్సి ఉంటుంది.

# ఓటమి లాంఛనమే..

## చేతులెత్తేసిన టీమిండియా

**రెండో ఇన్నింగ్స్‌లోనూ అదే తడబాటు**

**27 పరుగులకే 2 వికెట్లు సమర్పణ**

**భారత్ ముందు 549 పరుగుల భారీ లక్ష్యం**

**260/5 స్కోర్ వద్ద రెండో ఇన్నింగ్స్ డిక్లేర్**

**522 పరుగుల వెనుకంజలో టీమిండియా**

**విజయానికి 8 వికెట్ల దూరంలో సౌతాఫ్రికా**



సౌతాఫ్రికాతో రెండో టెస్ట్‌లో టీమిండియా చేతులెత్తేసింది. 549 పరుగుల భారీ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమిండియా నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 15.5 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 27 పరుగులు చేసింది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్(13), కేఎల్ రాహుల్(6) దారుణంగా విఫలమయ్యారు. నైట్‌వాచ్‌మన్‌గా కుల్దీప్ యాదవ్(2 బ్యాటింగ్) బ్యాటింగ్‌కు రాగా.. సాయి సుదర్శన్(2 నాటౌట్)మరో వికెట్ పడకుండా ఆటను ముగించాడు. ప్రస్తుతం భారత్ 522 పరుగుల వెనుకంజలో ఉంది. ఈ మ్యాచ్‌లో భారత్ ఓటమిని తప్పించుకోవాలంటే ఆఖరి రోజైన బుధవారం మొత్తం బ్యాటింగ్ చేయాలి. లేదంటే టీమిండియా ఘోర పరాజయం తప్పదు. సౌతాఫ్రికా విజయానికి 8 వికెట్లు కావాలి. ప్రస్తుతం సౌతాఫ్రికా బౌలర్లు ఉన్న ఫామ్ నేపథ్యంలో భారత ఓటమి పెద్ద కష్టమేం కాదనిపిస్తోంది. ఇప్పటికే పిచ్‌పై పగుళ్లు ఏర్పడి స్పిన్నర్లకు అడ్వాంటేజ్‌గా మారింది. ఆఖరి రోజు పిచ్ స్పిన్నర్లకు మరింత అనుకూలంగా మారనుంది. అంతకుముందు 26/0 ఓవర్‌నైట్ స్కోర్‌తో నాలుగో రోజు ఆటను ప్రారంభించిన సౌతాఫ్రికా 78.3 ఓవర్లలో 260/5 స్కోర్ వద్ద రెండో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. దాంతో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 288 పరుగులు కలుపుకొని మొత్తం 548 పరుగుల ఆధిక్యం సాధించింది. సఫారీ బ్యాటర్లలో ట్రిస్టన్ స్టబ్స్(180 బంతుల్లో 9 ఫోర్లు, సిక్స్‌తో 94) తృటిలో సెంచరీ చేజార్చుకోగా.. టోనీ డీ జోర్జీ(68 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 49) హాఫ్ సెంచరీ మిస్ చేసుకున్నాడు. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా ఒక్కడే(4/62) నాలుగు వికెట్లు తీయగా.. వాషింగ్టన్ సుందర్(1/67) ఒక వికెట్ పడగొట్టాడు. ఈ మ్యాచ్‌లో ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 489 పరుగుల భారీ స్కోర్ చేసింది. సెనరన్ ముత్తుసామి(206 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్స్‌లతో 109) సెంచరీ సాధించగా.. మార్కో జాన్సెన్(91 బంతుల్లో 6 ఫోర్లు, 7 సిక్సర్లతో 93) తృటిలో శతకాన్ని చేజార్చుకున్నాడు. అనంతరం భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 201 పరుగులకే ఆలౌటైంది. యశస్వి జైస్వాల్(58), వాషింగ్టన్ సుందర్(48) మినహా మరే బ్యాటర్ రాణించలేదు. మార్కో జాన్సెన్ 6 వికెట్లతో భారత్ పతనాన్ని శాసించాడు. ఈ మ్యాచ్‌లో భారత్ ఓటమి తప్పించుకోవాలంటే ఈ రోజు మిగిలిన 20 ఓవర్లతో పాటు ఆఖరి రోజు పూర్తిగా బ్యాటింగ్ చేయాలి. లేదంటే ఘోర పరాజయాన్ని భారత్ మూటగట్టుకుంటుంది. ఇప్పటికే ఈ సిరీస్‌లో సౌతాఫ్రికా 1-0తో ఆధిక్యంలో ఉంది. ఈ మ్యాచ్ డ్రా అయినా సిరీస్‌ను ఆ జట్టే కైవసం చేసుకుంటుంది. ఈ క్రమంలోనే భారత జట్టుపై నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు. 549 పరుగుల భారీ లక్ష్యాన్ని చూసి ఈ మ్యాచ్ గెలిచినట్టేనని నిట్టూరుస్తున్నారు. టెస్ట్‌ల్లో టీమిండియా మరో ఘోర పరాజయం తప్పేలా లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ సిరీస్‌లో టీమిండియా టాప్ ఆర్డర్ నుంచి మిడిల్ ఆర్డర్ వరకు దారుణంగా విఫలమైంది. సీనియర్ ఆటగాళ్లు కూడా పరుగులు చేయడానికి చాలా ఇబ్బంది పడుతున్నారు. కేఎల్ రాహుల్ అత్యధిక స్కోరు కేవలం 39 పరుగులు కాగా, రిషభ్ పంత్, రవీంద్ర జడేజా ఇద్దరి అత్యధిక స్కోరు కూడా 27 పరుగులే. ధ్రువ్ జురెల్ అయితే ఒక్క ఇన్నింగ్స్‌లో కూడా 20 పరుగుల మార్కును దాటలేకపోయాడు. అయితే ఈ సిరీస్‌లో భారత్ తరఫున అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మెన్ వాషింగ్టన్ సుందర్. మూడు ఇన్నింగ్స్‌లలో కలిపి 108 పరుగులు (అత్యధికం 48) చేశాడు. సుందర్ ఒక్కడే 100 పరుగుల మార్కును దాటగా, మిగతా స్టార్ బ్యాట్స్‌మెన్‌లు ఎవరూ వంద పరుగులు కూడా చేయలేకపోయారు.

భారత బ్యాట్స్‌మెన్‌లకు సెంచరీ సాధించడం ఈ సిరీస్‌లో ఒక కలగా మారింది. టీమిండియాకు ఇప్పుడు గౌహతి టెస్టులో నాలుగో, ఆఖరి ఇన్నింగ్స్‌లో మాత్రమే బ్యాటింగ్ చేసే అవకాశం ఉంది. ఒకవేళ ఈ చివరి ఇన్నింగ్స్‌లో కూడా ఏ ఒక్క భారత బ్యాట్స్‌మెన్ సెంచరీ చేయలేకపోతే, అది ఒక చెత్త రికార్డుగా నమోదవుతుంది. గత 30 సంవత్సరాలలో భారత గడ్డపై జరిగిన టెస్ట్ సిరీస్‌లలో, టీమిండియా తరఫున కనీసం ఒక్క సెంచరీ కూడా నమోదు కాని సందర్భం ఇదే మొదటిసారి అవుతుంది. ఈ రికార్డును తప్పించుకోవాలంటే ఆఖరి ఇన్నింగ్స్‌లో కనీసం ఒక బ్యాట్స్‌మెన్ అయినా సెంచరీ చేయాల్సి ఉంటుంది.

**సంక్షిప్త స్కోర్లు..**

సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్ 489 ఆలౌట్
భారత్ తొలి ఇన్నింగ్స్ 201 ఆలౌట్
సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్ 260/5 డిక్లేర్డ్
భారత్ రెండో ఇన్నింగ్స్ 27/2





# టీ20 ప్రపంచకప్ షెడ్యూల్ విడుదల

**ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభం**

**మార్చి 8 వరకు కొనసాగింపు**

**బ్రాండ్ అంబాసిడర్‌గా రోహిత్ శర్మ**



భారత్, శ్రీలంక ఆతిథ్యమివ్వనున్న టీ20 ప్రపంచకప్ వేదికలు ఖరారయ్యాయి. 2026 ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8వ తేదీ వరకు ఈ టోర్నమెంట్ జరగనుంది. అహ్మదాబాద్‌లో మార్చి 8న ఫైనల్ మ్యాచ్ నిర్వహించనున్నారు. ఒకవేళ పాకిస్థాన్ ఫైనల్ చేరితే మ్యాచ్ వేదికను మార్చే అవకాశం ఉంది. ఇందుకోసం భారత్‌లో ఐదు, శ్రీలంకలో మూడు వేదికలను ఎంపిక చేశారు. ఈ టీ20 ప్రపంచ కప్ బ్రాండ్ అంబాసిడర్?గా రోహిత్ శర్మను ఎంపిక చేసినట్ల జై షా తెలిపారు.

# స్మృతి మంధాన పెళ్లి వాయిదాపై రూమర్స్



స్మృతి మంధాన, పలాశ్‌ముచ్చల్ ల వివాహంలో ట్విస్ట్ ల మీద ట్విస్ట్ లు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా వీరి పెళ్లి వాయిదాపై అనేక రూమర్స్ నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి. ముందుగా అనుకున్నట్లు నవంబర్ 23న వీరి పెళ్లి మహారాష్ట్రలోకి సాంగ్లీలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రీవెడ్డింగ్ షూట్ లో స్మృతి మంధాన, పలాశ్‌ముచ్చల్ ఫుల్ జోష్ గా డ్యాన్స్ లు చేశారు. ఒకరి మెడలో మరోకరు పూల మాలలు కూడా వేసుకున్నారు. మరికొన్ని గంటల్లో పెళ్లి వేడుక జరుగనుంది. ఇంతలో స్మృతి మంధాన తండ్రి శ్రీనివాస్ కు గుండెపోటు రావడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఆ తర్వాత పెళ్లిని వాయిదా వేస్తున్నట్లు స్మృతి మంధాన కుటుంబ సభ్యులు ప్రకటించారు. మరుసటి రోజు పలాష్ ముచ్చల్ అస్వస్థతకు గురయ్యి వెంటనే కోలుకున్నాడు. ఆ తర్వాత స్మృతి మంధాన తన ఇన్ స్టాలోని వెడ్డింగ్, నిశ్చితార్థంకు సంబంధించిన అన్నిఫోటోలు, వీడియోలను డిలీట్ చేసింది. ఈ క్రమంలో అసలు వీరి మధ్య ఏంజరుగుతుందో అని నెట్టింట అనేక రూమర్స్ వార్తలు హల్ చల్ చేస్తున్నాయి. స్మృతి మంధానను.. పలాష్ చీటింగ్ కూడా చేశాడని వార్తలు తెరమీదకు వచ్చాయి. ఈ నేపథ్యంలో పలాశ్ ముచ్చల్ సోదరి, సింగర్ పలాక్ ముచ్చల్ తన ఇన్ స్టా వేదికగా వివరణ ఇచ్చారు.స్మృతి మంధాన తండ్రి శ్రీనివాస్ మంధాన అనారోగ్యానికి గురవడంతో ప్రస్తుతానికి స్మృతి, పలాశ్ ల వివాహం నిలిచిపోయిందని తెలిపారు. ప్రస్తుతం రెండు కుటుంబాలుకూడా ఒత్తిడిలో ఉన్నాయని.. ఈ సున్నితమైన పరిస్థితిలో ఇరు కుటుంబాల గోప్యతను గౌరవించాలంటూ, తొందరలోనే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని ఇన్ స్టాలో పోస్టు పెట్టారు. మరోవైపు వీరి పెళ్లిపై ప్రస్తుతం బిగ్ సస్పెన్స్ నెలకొంది. మొత్తంగా స్మృతి మంధాన, పలాశ్‌ముచ్చల్ ల ఎపిసోడ్ సోషల్ మీడియాలో ట్రెండింగ్ గా మారింది.

# టీమిండియా బ్యాటింగ్ ఆర్డర్‌పై రవిశాస్త్రి ఫైర్



భారత్, సౌతాఫ్రికా మధ్య గౌహతిలో జరుగుతున్న రెండో టెస్ట్ మ్యాచ్‌లో టీమిండియా బ్యాటింగ్ ఆర్డర్‌పై మాజీ కోచ్, మాజీ కెప్టెన్ రవిశాస్త్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత జట్టు బ్యాటింగ్ ప్రదర్శన పేలవంగా ఉండటంతో, టీమ్ మేనేజ్‌మెంట్ వ్యూహాన్ని శాస్త్రి తప్పుపట్టారు. 489 పరుగుల సౌతాఫ్రికా స్కోరుకు సమాధానంగా భారత్ కేవలం 201 పరుగులకే ఆలౌట్ అయింది. స్టార్ నెట్‌వర్క్‌లో కామెంటరీ ఇస్తున్న రవిశాస్త్రి, భారత జట్టు నిర్ణయాలను ఏ మాత్రం సమర్థించలేదు. "అసలు అర్థం లేదు. ఆ ఆలోచనా విధానం ఏంటో నాకు అర్థం కావడం లేదు" అని ఆయన టీమిండియా పై నిప్పులు చెరిగారు. ముఖ్యంగా టీమిండియా బ్యాటింగ్ ఆర్డర్‌ను తరచూ మార్చడాన్ని ఆయన ప్రశ్నించారు. తొలి టెస్టులో వాషింగ్టన్ సుందర్‌ను నంబర్ 3 స్థానంలో పంపి, రెండో టెస్టులో సాయి సుదర్శన్‌ను నంబర్ 3లో ఉంచి, సుందర్‌ను ఏకంగా నంబర్ 8కి దించడం సరికాదన్నారు. "సుందర్ నంబర్ 8 బ్యాటర్ కాదు, అతను అంతకంటే మెరుగైన ఆటగాడు. ఈ సిరీస్‌ను వెనక్కి తిరిగి చూసుకుంటే, కొన్ని సెలెక్షన్ నిర్ణయాలు ఏ ఉద్దేశంతో తీసుకున్నారో ఇప్పటికీ అర్థం కావడం లేదు" అని శాస్త్రి విమర్శించారు. గతంలో కోల్‌కతాలో జరిగిన తొలి టెస్టులో భారత జట్టు నలుగురు స్పిన్నర్లను ఆడించి, వారిలో ఒక స్పిన్నర్‌కు కేవలం ఒకే ఓవర్ ఇవ్వడాన్ని కూడా శాస్త్రి గుర్తు చేశారు. "అక్కడ నలుగురు స్పిన్నర్లకు బదులు ఒక స్పెషలిస్ట్ బ్యాటర్‌ను ఆడిస్తే బాగుండేది. అలాగే ఇక్కడ సాయి సుదర్శన్ వచ్చాడు కాబట్టి వాషింగ్టన్ సుందర్‌ను నంబర్ 8లో కాకుండా కనీసం నంబర్ 4లో అయినా ఆడించాల్సింది" అని ఆయన సూచించారు. భారత జట్టు బ్యాటింగ్ వైఫల్యం తర్వాత, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్ ఎనిమిదో వికెట్‌కు 72 పరుగుల భాగస్వామ్యాన్ని జోడించారు. ఈ భాగస్వామ్యం కారణంగానే భారత్ కనీసం 200 పరుగుల మార్కును దాటగలిగింది. సుందర్ 92 బంతుల్లో 48 పరుగులు చేయగా, కుల్దీప్ 134 బంతుల్లో 19 పరుగులు చేసి వికెట్ పడకుండా పోరాడాడు. అయినప్పటికీ సౌతాఫ్రికా 288 పరుగుల భారీ ఆధిక్యాన్ని తీసుకోవడాన్ని ఆపలేకపోయారు. సౌతాఫ్రికా తరఫున మార్కో జన్సెన్ 6/48తో, సైమన్ హార్మర్ 3/64తో భారత బ్యాటింగ్ పతనానికి కారణమయ్యారు.



# రోహిత్, కోహ్లీ 2027 వరల్డ్ కప్ ఆడాలి

**సౌతాఫ్రికా లెజెండరీ ఫీల్డర్ జాంటీ రోడ్స్**

ఇండియా సీనియర్ స్టార్స్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల భవిష్యత్తుపై ఇప్పుడు క్రికెట్ ప్రపంచంలో పెద్ద చర్చ జరుగుతోంది. 2027 వన్డే వరల్డ్‌కప్ నాటికి వీరిద్దరూ జట్టులో ఉంటారా లేక మేనేజ్‌మెంట్ తప్పిస్తుందా? అనే సందేహాలు అందరిలోనూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో సౌతాఫ్రికా లెజెండరీ ఫీల్డర్ జాంటీ రోడ్స్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. రోహిత్, కోహ్లీ ఇద్దరూ 2027 వరల్డ్ కప్ ఆడాలని, వారి అవసరం టీమ్‌ఇండియాకు చాలా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ క్రమంలో మాజీ క్రికెటర్లు సచిన్, ధోనీ పేర్లను ప్రస్తావించారు. రోహిత్, కోహ్లీకు ఉన్న అనుభవం, మానసిక దృఢత్వం వెలకట్టలేనివని జాంటీ అన్నారు. "వరల్డ్?కప్ లాంటి మెగా టోర్నీల్లో కేవలం టాలెంట్ ఉంటే సరిపోదు, ఒత్తిడిని తట్టుకునే మానసిక శక్తి కావాలి. అది వీరిద్దరి దగ్గర పుష్కలంగా ఉంది. అందుకే 2027 వరల్డ్ కప్‌లో వీరు ఆడాలని నేను కోరుకుంటున్నాను" అని రోడ్స్ చెప్పుకొచ్చారు. యువ ఆటగాళ్లు ఎంతమంది ఉన్నా, ఇటువంటి భారీ ఈవెంట్లలో సీనియర్ల పాత్రే కీలకమని ఆయన విశ్లేషించారు. రిటైర్మెంట్ ఎప్పుడు తీసుకోవాలి అనే ప్రశ్నపై స్పందిస్తూ రోడ్స్ ఆసక్తికరమైన ఉదాహరణలు ఇచ్చారు. "గతంలో సచిన్ తెందూల్కర్, ఎంఎస్ ధోనీ విషయంలోనూ ఇలాంటి ప్రశ్నలే వచ్చాయి. ఎప్పుడు రిటైర్ అవ్వాలి? ఎప్పుడు ఆడాలి? అనేది పూర్తిగా వాళ్ల ఇష్టం. వాళ్లు పరుగులు చేస్తున్నంత కాలం, ఫిట్‌గా ఉన్నంత కాలం వాళ్లను జట్టులో సెలెక్ట్ చేయాల్సిందే. అనుభవం అనేది మార్కెట్లో దొరికే వస్తువు కాదు" అని రోడ్స్ గట్టిగా సమాధానం ఇచ్చారు. రోహిత్, కోహ్లీ ఇంకా పరుగులు సాధిస్తున్నారని, వారిని పక్కన పెట్టాల్సిన అవసరం లేదని ఆయన అభిప్రాయపడ్డారు. ఇక రోహిత్, కోహ్లీ కెరీర్ విషయానికి వస్తే, 2025 మే నెలలో వీరిద్దరూ టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించి అందరికీ షాక్ ఇచ్చారు. ఇంగ్లాండ్‌తో జరగాల్సిన ప్రతిష్టాత్మక 'అండర్సన్ తెందూల్కర్ ట్రోఫీ 2025'కి ముందే వీరు సుదీర్ఘ ఫార్మాట్ నుంచి తప్పుకున్నారు. ప్రస్తుతం వీరిద్దరూ వన్డే ఫార్మాట్‌లో మాత్రమే దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వన్డేలపైనే పూర్తిగా దృష్టి సారించి, 2027 వరల్డ్ కప్ ఆడాలనే కసి వీరిలో కనిపిస్తోంది. మరోవైపు, టీమ్‌ఇండియా మేనేజ్‌మెంట్ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆస్ట్రేలియా సిరీస్‌కు ముందే రోహిత్ శర్మను వన్డే కెప్టెన్సీ నుంచి తప్పించి, యువ సంచలనం శుభ్‌మన్ గిల్‌కు పగ్గాలు అప్పగించింది. రోహిత్ ఇప్పుడు ఒక బ్యాటర్‌గా మాత్రమే జట్టులో కొనసాగుతున్నారు. కెప్టెన్సీ భారం లేకపోవడంతో రోహిత్ మరింత స్వేచ్ఛగా బ్యాటింగ్ చేస్తాడని, ఇది 2027 వరల్డ్ కప్ మిషన్‌కు ప్లస్ అవుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తానికి జాంటీ రోడ్స్ వ్యాఖ్యలు రోహిత్, కోహ్లీ అభిమానుల్లో కొత్త జోష్ నింపాయి. మరి విరాట్, రోహిత్ ఫ్యూచర్‌పై మేనేజ్‌మెంట్ ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందో చూడాలి.



# 28న అఖండ-2 ప్రీరిలీజ్ ఈవెంట్

నందమూరి బాలకృష్ణ, డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబోలో అఖండకు సీక్వెల్ గా వస్తున్న చిత్రం 'అఖండ-2. ఇప్పటికే రిలీజ్ చేసిన అఖండ 2 ఫస్ట్ గ్లిమ్స్ సంచలనం సృష్టించింది. ఇటీవల వచ్చిన ఈ సినిమా ఫస్ట్ సింగిల్ జాజికాయ జాజికాయ భారీ వ్యూస్ రాబట్టిన ఈ సెన్సేషన్ సినిమాకు థమన్ సంగీతం అందిస్తున్నాడు. డిసెంబర్ 5న అఖండ 2 వరల్డ్ వైడ్ గా రిలీజ్ కు రెడీ అయింది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్ లో జోరు పెంచింది టీమ్. అందులో భాగంగానే అఖండ 2 ప్రీ రిలీజ్ ఈవెంట్ ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 28న నిర్వహించబోయే అఖండ 2 ప్రీ రిలీజ్ ఈవెంట్ కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా రాబోతున్నారు. ఇందుకు సంబంధించి అనౌన్స్ మెంట్ కూడా రాబోతుంది. అలాగే ఈ వేడుకకు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ని కూడా మరో అతిథిగా పిలిచేందుకు ప్లాన్ చేశారట మేకర్స్. కానీ బన్నీ ప్రస్తుతం అట్లీ సినిమా షూటింగ్ లో బిజీగా ఉండడం వల్ల రావడం కుదరడం లేదట. సినిమా రిలీజ్ అయ్యాక సక్సెస్ మీట్ కి బన్నీ వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. మరోవైపు డిసెంబరు 4న రాత్రి నుంచే ప్రీమియర్లు ప్రదర్శించాలని నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. అందుకు తగ్గ అనుమతుల కోసం నిర్మాతలు ఎదురు చూస్తున్నారు.

# భాగ్యశ్రీతో డేటింగ్ అంతా ఉత్తిదే

## కొట్టిపడేసిన హీరో రామ్




ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా భాగ్యశ్రీ హీరోయిన్ జంటగా వస్తున్న మూవీ ఆంధ్రాకింగ్ తాలూకా నవంబర్ 27న రిలీజ్ కాబోతోంది. అయితే ఈ సినిమా మొదలైనప్పటి నుంచి రామ్, భాగ్య శ్రీ డేటింగ్ లో ఉన్నారంటూ ఓ రేంజ్ లో రూమర్లు వస్తున్నాయి. ఇద్దరూ ప్రైవేట్ గా కలుసుకుంటున్నారని.. విదేశాలకు టూర్లకు వెళ్తున్నారంటూ రకరకాల రూమర్లు వస్తూనే ఉన్నాయి. ఇక మూవీ రిలీజ్ డేట్ దగ్గర పడుతుండటం తో వరుస ప్రమోషన్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రామ్.. దీనిపై క్లారిటీ ఇచ్చారు. డేటింగ్ రూమర్లు అన్నీ ఫేక్ అంటూ కొట్టి పారేశాడు. భాగ్య శ్రీ తనకు మంచి ఫ్రెండ్ అని క్లారిటీ ఇచ్చాడు. ఈ సినిమా కోసం నేను స్వయంగా ఓ లవ్ సాంగ్ రాశాను. అప్పటి నుంచి మా ఇద్దరి మధ్య ఏదో ఉందని అంతా అనుకుంటున్నారు. భాగ్య శ్రీపై ఇంట్రెస్ట్ లేకుండా ఇంత మంచి సాంగ్ రాయడు కదా అని అంతా అనుకుంటున్నారు. కానీ భాగ్యశ్రీని మా సినిమా కోసం తీసుకోక ముందే ఆ పాట రాశాను. సినిమాలోని హీరో, హీరోయిన్ పాత్రల మధ్య అంత మంచి బాండింగ్ ఉంటుంది కాబట్టే ఆ పాట బాగా వచ్చింది. అంతకు మించి మా మధ్య ఏమీ లేదు. భాగ్య శ్రీ మంచి యాక్టర్ అంటూ చెప్పాడు రామ్. భాగ్య శ్రీ కూడా ఇదే విషయంపై స్పందిస్తూ.. రామ్ తనకు మంచి ఫ్రెండ్ మాత్రమే అని తెలిపింది. రజనీకాంత్ అంటే నాకు చాలా ఇష్టం. చిన్నప్పటి నుంచి చెన్నైలో పెరిగాను. ఆయన సినిమాలన్నీ చూసేవాడిని. 'బాషా' సినిమా అనుభవాన్ని ఎప్పటికీ మర్చిపోలేను. ఆ సినిమాకు 100వ రోజు కూడా టికెట్స్ దొరకలేదు. చివరి నిమిషంలో రెండు టికెట్స్ దొరికాయి. దీంతో నేను మా ఫ్రెండ్ వెళ్లాం. ఆరోజు థియేటర్లో అభిమానులు ఆ సినిమాను సెలబ్రేట్ చేసుకోవడం చూసి ఆశ్చర్యపోయాను. అప్పటికే వాళ్లు ఆ సినిమాను ఎన్నోసార్లు చూసి ఉంటారు. డైలాగులు కూడా తెలిసిపోయి ఉంటాయి. అయినా అందరూ ఆసక్తిగా చూడడం చూసి నేను షాకయ్యానని రామ్ తెలిపాడు. ఎవరైనా సక్సెస్ కావాలంటే వారికి రెండు ప్రధాన కారణాలు ఉంటాయి. ఎవరికి వారు తాము చేసే పని మీద శ్రద్ధ కలిగిఉండాలి. అలాగే దానికోసమే పుట్టాం అనిపించేలా చాలా కష్టపడాలి. నాకు ఆ రెండు లక్షణాలు ఉన్నాయి. అందుకే ఎప్పటికైనా విజయం సాధిస్తాననే నమ్మకం ఉందన్నాడు.



# వారణాసి లెవల్లో ఎన్టీఆర్-నీల్ మూవీ ప్రమోషన్?

వారణాసి మూవీ టైటిల్‌ను భారీ ఈవెంట్ ద్వారా ప్రకటించిన విషయం తెలిసిందే. భారతీయ సినిమా ప్రమోషన్స్‌కు ఇది కొత్త నిర్వచనంగా మారింది. ఈ వినూత్న ప్రయత్నం దేశవ్యాప్తంగా మాత్రమే కాదు, హాలీవుడ్ మీడియా దృష్టిని కూడా ఆకర్షించి గ్లోబల్ లెవెల్‌లో పెద్ద చర్చగా మారింది. సాధారణంగా టైటిల్స్‌ను పోస్టర్, గ్లింప్స్ లేదా సోషల్ మీడియా పోస్టుల ద్వారా ప్రకటిస్తారు. కానీ వారాణాసి యూనిట్ మాత్రం పాత్రలు, కథ, థీమ్ వివరించే క్రమంలో స్టేజ్ ఈవెంట్ ఏర్పాటు చేసి ప్రమోషన్‌లో కొత్త మైలురాయి సృష్టించింది. దీనికి మంచి రెస్పాన్స్ రావడంతో ఇప్పుడు ఇదే స్ట్రాటజీని ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ కాంబోలో రూపొందుతున్న సినిమాకి ఉపయోగించనున్నట్టు తెలుస్తోంది. ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ మూవీ టైటిల్‌పై భారీ ఆసక్తి నెలకొనగా, మూవీకి డ్రాగన్ అనే పేరు ఖరారు చేసినట్టు టాక్ వినిపిస్తుంది. అయితే డ్రాగన్' పేరు ఇంకా నిర్ధారణ కాలేదని మైత్రి మూవీ మేకర్స్ ప్రొడ్యూసర్ రవి శంకర్ స్పష్టం చేశారు. 'డ్రాగన్ కూడా ఓ ఆప్షన్ మాత్రమే. అధికారికంగా ఏ టైటిల్ ఫైనల్ కాలేదు. ఇది పూర్తిగా అంతర్జాతీయ స్థాయిలో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్. ప్రశాంత్ నీల్ విజన్‌లో ఎన్టీఆర్ కొత్త అవతరం చూపించ బోతున్నాడు. టైటిల్, ఫస్ట్ గ్లింప్స్ వారణాసి మాదిరిగానే ప్రాజెక్ట్‌కి తగ్గ స్థాయిలో గ్రాండ్‌గా రిలీజ్ చేస్తామని తెలిపారు. ఫిల్మ్ ప్రమోషన్‌లో భారీ ఈవెంట్ మోడల్ ఎన్నో ప్రయోజనాలను కలిగిస్తోంది. సినిమా థీమ్‌ను స్పష్టంగా ప్రేక్షకులకు చెప్పే అవకాశం కలుగుతుంది. ఇలా చేస్తే గ్లోబల్ ఆడియన్స్‌ను చేరుకునే అవకాశం ఉంటుంది. హాలీవుడ్ మీడియా సహా విదేశీ ప్రెస్ అటెన్షన్, తక్కువ సమయంలో భారీ బజ్ క్రియేట్ చేయగలగడం, కంటెంట్‌పై తప్పుదారులు వెళ్లకుండా క్లారిటీ ఇవ్వడం కొత్త ట్రెండ్‌ను ఆమోదించేలా చేశాయి. వారణాసి ఈవెంట్ తర్వాత భారతీయ సినీ పరిశ్రమలో 'టైటిల్ రివీల్ ఈవెంట్' అనే కొత్త ప్రమోషనల్ ట్రెండ్ ప్రారంభమైంది. అదే మోడ్‌లో ఎన్టీఆర్-నీల్ ప్రాజెక్ట్ కూడా అడుగులు వేస్తుండటం అభిమానుల్లో భారీ అంచనాలను పెంచింది.



# 28న నెట్‌ఫ్లిక్స్‌లో మాస్ జాతర రిలీజ్

మాస్ మహారాజా రవితేజ హీరోగా నటించిన 75వ చిత్రం 'మాస్ జాతర'. యంగ్ బ్యూటీ శ్రీలీల హీరోయిన్ గా కనిపించిన ఈ సినిమాకు భాను భోగవరపు దర్శకత్వం వహించాడు. అక్టోబరు 31న ప్రీమియర్స్ తో వరల్డ్ వైడ్ గా రిలీజ్ అయింది. కానీ ప్రీమియర్ షో నుండే ఈ సినిమా ఫ్లాప్ టాక్ తెచ్చుకుంది. రొటీన్ రెగ్యులర్ కథ, బోరింగ్ స్క్రీన్ ప్లేతో ఆడియెన్స్ కు విసుగుతెప్పించాడు దర్శకుడు. రాజేంద్ర ప్రసాద్ క్రింజ్ కామెడి నవ్వుతెప్పించకపోగా విసిగించింది. కనీసం మినిమం వసూళ్లు కూడా రాబట్టలేక రవితేజ కెరీర్ లో మరో డిజాస్టర్ గా మిగిలింది. రిలీజ్ కు ముందే మాస్ జాతర డిజిటల్ రైట్స్ ను నెట్ ఫ్లిక్స్ భారీ ధరకు కొనుగోలు చేసింది. థియేటర్ లో ఫ్లాప్ అయినా ఈ సినిమా ఓటీటీ రిలీజ్ డేట్ ఫిక్స్ చేసుకుంది. ఈ నెల 28 నుండి నెట్ ఫ్లిక్స్ ఈ సినిమాను స్ట్రీమింగ్ కు తీసుకురాబోతుంది. తెలుగు, తమిళ్, మలయాళం, కన్నడ భాషలలో ఈ సినిమాను స్ట్రీమింగ్ తీసుకువస్తుంది నెట్ ఫ్లిక్స్. థియేటర్ లో రిలిజ్ అయిన 28 రోజుల తర్వాత మాస్ జాతర ను స్ట్రీమింగ్ చేస్తుంది నెట్ ఫ్లిక్స్.

# రాజాసాబ్ పాటకు భారీగా వ్యూస్..లైక్స్

## మూవీపై నిర్మాతల్లో పెరిగిన విశ్వాసం

ప్రభాస్ హీరోగా పాన్ ఇండియా సినిమా ది రాజా సాబ్ పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. గత ఏడాది కల్కితో వరల్డ్‌వైడ్ బ్లాక్‌బస్టర్ హిట్ అందుకున్న ప్రభాస్ సినిమాపై అభిమానులు, ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. సంక్రాంతి రిలీజ్‌గా ఈ సినిమా సిద్ధమవుతుండటంతో హైప్ మరింత పెరిగింది. ఇదిలా ఉండగా, చిత్రబృందం నుంచి వచ్చిన తొలి పాట నవంబర్ 23 విడుదలైంది. కొంత ఆలస్యంగా వచ్చినప్పటికీ, ఆన్‌లైన్‌లో పాటకు మంచి స్పందన లభించింది. టాప్ రికార్డులను బద్దలు కొట్టకపోయినా,ఈ పాటకు వచ్చిన వ్యూస్, లైక్స్ మాత్రం ఆకట్టుకునే స్థాయిలో ఉన్నాయి. విడుదలైన తొలి 24 గంటల్లో ఈ పాటకు దాదాపు 14.92 మిలియన్ వ్యూస్, 335.4ఐ లైక్స్ వచ్చాయి. ఇది పెద్ద రికార్డ్ కాకపోయినా, ఆలస్యంగా వచ్చిన పాటకు ఇవి గుడ్ నెంబర్స్‌గా పరిగణిస్తున్నారు. ప్రభాస్ తాజాగా చేసిన సినిమాలతో పోలిస్తే, ఈ పాటలో ఆయన లుక్, స్క్రీన్ ప్రెజెన్స్ చాలా బాగుందని నెటిజన్లు పేర్కొంటున్నారు. ప్రత్యేకంగా, పాట యూట్యూబ్‌లో విడుదలైన తర్వాత కేవలం 23 నిమిషాల్లో 100ఐ లైక్స్ చేరుకోవడం పాటకు వచ్చిన వేగవంతమైన రెస్పాన్స్‌ను సూచిస్తోంది. ఇది ప్రభాస్ క్రేజ్‌కి నిదర్శనమని అభిమానులు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. పాట విడుదల సందర్భంగా హైదరాబాద్‌లోని విమల్ థియేటర్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్క్రీనింగ్‌కు భారీగా అభిమానులు హాజరై మాస్ సెలబ్రేషన్స్ చేశారు.

ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ అందుకుంది. దీంతో 'ది రాజా సాబ్'పై అంచనాలు మరింతగా పెరిగాయి. త్వరలో రానున్న ట్రైలర్, మిగతా పాటలు ఎలా ఉండబోతున్నాయి, సంక్రాంతి సీజన్‌లో ఈ సినిమా ఎంతటి మాస్ స్టార్మ్ సృష్టించబోతుందో అనే ఆసక్తి పెరుగుతోంది.




Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463